ఏలూరు ఉష్ణోగ్రతలు

గరిష్ఠం : 33.0

కనిష్ఠం : 25.0



వెబ్‌సైట్ వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్పీ కేపీఎస్ కిశోర్

మహిళల రక్షణకు పోలీస్ వెబ్‌సైట్

ఏలూరు క్రైం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణ కోసం సమాచారంతో కూడిన పోలీస్ వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ కేపీఎస్ కిశోర్ చెప్పారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో అఫీషియల్ వెబ్‌సైట్‌ను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న సైబర్ నేరాలు, వివరాలు, నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఈ వెబ్‌సైట్ ద్వారా తెలియజేస్తామన్నారు. జిల్లాకు సంబంధించి సోషల్ మీడియా సైట్లు వాటి వివరాలు అందుబాటులో ఉంటాయన్నారు. జిల్లా పోలీసులు నిర్వహించే కార్యక్రమాలన్నీ ఈ వెబ్‌సైట్‌లో ఉంటాయన్నారు. పోలీస్ స్టేషన్ల సమాచారం, అధికారి, ఫోన్ నెంబర్లు లభిస్తాయన్నారు. ఏఎస్పీ ఎస్.సూర్యచంద్రరావు, నూజివీడు డీఎస్పీ ప్రసాద్, ఎస్‌బిసి ఇన్‌చార్జి స్వామి, జిల్లా ఐటీ ఇన్‌చార్జి ఆర్ఎస్ఐ నరేంద్ర, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రి రెడ్డి

ప్రజా సమస్యల పరిష్కారంపై చొరవ

ఏలూరు రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): అర్జీదారుల సమస్యలపై ప్రత్యేక దృష్టిసారించి వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ వెట్రి సెల్వి అధికారులను ఆదేశించారు. మంగళవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి 81 వినతులు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ విజ్ఞప్తులను అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణచేసి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. జేసీ పి.ధాత్రిరెడ్డి, డీఆర్వో పుష్పమణి, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు తదితరులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

5 నుంచి 'ఉల్లాస్' కార్యాచరణ

ఏలూరు అర్బన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సంపూర్ణ అక్షరాస్యత జిల్లాగా తీర్చిదిద్దేందుకు 'ఉల్లాస్' కార్యక్రమం అమలుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. అధికారులతో మంగళవారం నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ అక్షరాస్యతా కార్యక్రమాలను, తరగతులను నవంబరు 5 నుంచి వచ్చే ఏడాది మార్చి 15 వరకు ప్రతీరోజు సాయంత్రం రెండు గంటలపాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించాలని ఆదేశించారు. మార్చిలో పరీక్షలు నిర్వహించి, ఉత్తీర్ణులకు ధ్రువీకరణ పత్రాలను అందజేస్తామన్నారు. డిజిటల్ లిటరసీ, ఫంక్షనల్ లిటరసీ, ఫైనాన్షియల్ లిటరసీ కార్యక్రమాల ద్వారా బ్యాంకుల నుంచి రుణాలు పొందడం, సంఘాల రికార్డుల నిర్వహణ, కాంట్రాక్టులు, ఒప్పందాలు, ఆన్‌లైన్ లావాదేవీలు తదితర అంశాలపై అవగాహన కలిగించాలని సూచించారు. ఈ నెల 16 నుంచి 24 వరకు మండలాల వారీగా నిరక్షరాస్యుల వివ రాల సేకరణ జరగాలన్నారు.

డిమాండ్‌కు తగ్గట్టు ఇసుక సరఫరా

ఏలూరు సిటీ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): డిమాండ్‌కు తగ్గట్టు ఇసుకను సరఫరా చేస్తున్నామని కలెక్టర్ కె.వెట్రిసెల్వి గనుల శాఖ కార్యదర్శి ముఖేశ్ కుమార్‌మీనాకు తెలిపారు. ఇసుక తవ్వకాలపై ఆయన జిల్లా కలెక్టర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. ఇసుక తవ్వక ప్రదేశాల్లో సీసీ కెమేరాల ద్వారా పర్య వేక్షించాలన్నారు. ఇసుక అక్రమంగా తరలకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అక్రమ రవాణాకు ఆస్కారం లేకుండా నిఘా పెట్టామని, జీపీఎస్ కలిగిన వాహనాల ద్వారా అందిస్తున్నామన్నారు.

పల్లె పండుగతో రోడ్లకు మహర్దశ



కామవరపుకోటలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్

ఏలూరు సిటీ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ మహోత్సవాలు జిల్లావ్యాప్తంగా రెండో రోజు మంగళవారం రెండో రోజు ఘనంగా జరిగాయి. సీసీ రోడ్లు, డ్రెయిన్స్, ఇతర ఉపాధి పనులకు ఆయా ప్రాంతాల్లో ప్రజా ప్రతినిధులు శ్రీకారం చుట్టారు. ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలలో 68 గ్రామ పంచాయతీల్లో 152 అభివృద్ధి పనులకు ప్రజా ప్రతినిధులు శంకుస్థాపన చేశారు. ముసునూరు మండలంలో రూ. 82.25 లక్షలతో 16 సీసీ రహదారులకు మంత్రి కొలుసు పార్థసారధి శంకుస్థాపన చేశారు. ముదినేపల్లి మండలంలో కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పాల్గొన్నారు. పెదవేగి మండలంలో రూ.25.50 లక్షలతో సీసీ రహదారులకు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ శంకుస్థాపన చేశారు. పెదవేగిలో పల్లె పండుగ కార్యక్రమంపై నియోజకవర్గ సమీక్ష సమావేశం నిర్వహించారు. కొయ్యలగూడెం మండలంలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. వివిధ గ్రామ పంచాయతీల్లో ఆయా ప్రాంతాల ప్రజా ప్రతినిధులు సీసీ రహదారులతోపాటు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు.



వల్మీకంలో శ్రీనివాసుడి అలంకారం

వల్మీకంలో శ్రీనివాసుని అలంకారం భక్తులను పరవశింపజేసింది. శ్రీవారి ఆశ్వయుజ మాస దివ్యబ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం పుట్టలో ఉండి గోవు ఇచ్చే పాలను ఆహారంగా స్వీకరిస్తున్న అలంకారం ఆకట్టుకుంది. ఆవు పుట్టవద్దకు వెళ్లి పాలు జార విడిచి ఆయన ఆకలి తీర్చే సన్నివేశాన్ని కట్టుకు కట్టినట్లు చూపేలా అలంకారం చేశారు

చంద్రప్రభ వాహనంపై శ్రీవారి చిద్విలాసం

చంద్రప్రభ వాహనంపై ఉభయదేవేరులతో కొలువైన శ్రీవారు మంగళవారం రాత్రి క్షేత్రపురవీధుల్లో ఊరేగారు. ఉదయం వర్షంతో సూర్యప్రభ వాహనసేవ రద్దయింది. మధ్యాహ్నం వర్షం తెరపి ఇవ్వడంతో చంద్రప్రభ వాహనసేవను అట్టహాసంగా జరిపించారు. చంద్రప్రభపై స్వామి అమ్మవార్లను ఉంచి అర్చకులు ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు.

- ద్వారకాతిరుమల/ఆంధ్రజ్యోతి



ఆలయం నుంచి చంద్రప్రభ వాహనంపై ఉభయ దేవేరులతో వెళుతున్న శ్రీవారు

మద్యం దుకాణాలకు లైసెన్స్‌లు జారీ కావడంతో నేటి నుంచి కొత్త దుకాణాలు ఏర్పాటు కానున్నాయి. లాటరీలో మద్యం వ్యాపారంలో కొత్త వారు ఎక్కువ మందికి లైసెన్స్‌లు దక్కాయి. కొత్తవారు దుకాణాల ఏర్పాటు, సరుకు కోసం ఇండెంట్ పెట్టడంలో కొంత తికమకపడుతున్నారు. అలాంటి వారికి సీనియర్ అధికారులు సూచనలు ఇవ్వడం విశేషం. లైసెన్స్ దక్కని కొందరు కొత్తగా దుకాణాలు ఏర్పాటు చేస్తున్న వారిని సంప్రదిస్తున్నారు. ఎమ్మెల్యేల అనుచరులు, నాయకులు రాయబేరాలు సాగిస్తున్నారు. మరోవైపు మందుబాబులు కోరుకునే బ్రాండ్లు అందుబాటులోకి రానున్నాయని ఖుషీగా ఉన్నా ధరల తగ్గుదలపై కొంత ఉత్కంఠగా ఉన్నారు.

కొత్తగా.. ఖుషీగా





- మద్యం ఇండెంట్ కోసం కొత్త ముఖాల తిప్పలు
- పాత వ్యాపారులు, నేతల రాయబేరాలు
- ధరలు, బ్రాండ్లపై మందుబాబుల ఉత్కంఠ

144 మద్యం దుకాణాల్లో నేటి నుంచి విక్రయాలు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

జిల్లా వ్యాప్తంగా 144 మద్యం దుకాణాల్లో విక్రయాలు బుధవారం ప్రారంభం కానున్నాయి. ఇప్పటివరకు ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాలు మంగళవారం మూతపడ్డాయి. కొత్త మద్యం విధానం ద్వారా విక్రయాలు సాగించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. దుకాణాల ఏర్పాటు, కావాల్సిన సరుకుకోసం ఇండెంట్ పెట్టడం, దుకాణం నిర్వహణకు సిబ్బందిని సిద్ధం చేయడంలో వ్యాపారులంతా తలమునకలయ్యారు. డిమాండ్ ఉన్న ప్రాంతాల్లోనే దుకాణాలు పెట్టుకోవడానికి అనువుగా కొందరు ప్రయత్నించినా ఆ తరహా దుకాణాలేవీ అందుబాటులో లేకపోవడంతో మంగళవారం మధ్యాహ్నం వరకు ముప్పుతిప్పలు పడ్డారు. దుకాణం నిర్వహణ, ఇతరత్ర అంశాలపై కొత్త ముఖాలకు మరికొందరు సీనియర్లు కూడా తోడవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా కొత్త సరుకుతో వ్యాపారాన్ని ఆరంభించేందుకు ఇతరుల సాయం కూడా దుకాణ యజమానులు అభ్యర్థిస్తున్నారు. ఇప్పటికే కొందరు దుకాణదారులు స్థానిక ఎమ్మెల్యేలు, ఎక్సైజ్ అధికారులు, పోలీసులు, స్థానికంగా ఉన్న నేతలను కలిసి వ్యాపారంలో సహకరించాలని అభ్యర్థించారు. ఇప్పటివరకు సాగిన ప్రభుత్వ మద్యం దుకాణాల కాంట్రాక్టు గడువు ఈనెల 4న ముగిసింది. అదే దుకాణాల్లో కూడా కొన్నింటిని కొత్తగా తెరిచేందుకు మంగళ వారం పొద్దుపోయేంత వరకు ఏర్పాట్లలో వ్యాపా రులు ఉన్నారు. లాటరీ విధానం ద్వారా 144 దుకాణాలకు లైసెన్సీలకు అదృష్టం దక్కినా మొదటి రోజు దుకాణాలు తెరవడానికి ఏర్పాట్లలో కొందరి పాట్లు వర్ణనాతీతం. ఎక్సైజ్ శాఖలో కొంతమంది దుకాణాలు ఆరంభించడం, సజావుగా వ్యాపారం సాగించడంలో సూచనలు ఇచ్చినట్టు సమాచారం.

ఇండెంట్.. ఇక్కట్లు

మద్యం కొత్త విధానం.. నూతనంగా వ్యాపారం ఆరంభించేందుకు కొన్ని గంటలు మాత్రమే మిగిలి ఉండగా దుకాణాలు దక్కించుకున్న వారిలో కొందరు మంగళవారం ఒకింత గందరగోళంలో ఉన్నారు. బుధవారం నుంచి కొత్తగా మద్యం బ్రాండ్‌లన్నింటిని విక్రయించాల్సి ఉన్నందున అనభవం ఉన్నవారు మంగళవారం మధ్యాహ్నం నాటికే ఇండెంట్ నేరుగా సమర్పించారు. దుకాణాల వారీగా ఎక్సైజ్ శాఖ నిబంధనల ప్రకారం కోడ్ వారీగా మద్యం సరఫరా చేస్తుంది. తాము విక్రయించబోయే మద్యం ధరలు ఏ రూపంలో ఉన్నాయో తెలియక, అధికారులు సైతం వీటిని వివరించేందుకు సంసిద్ధత వ్యక్తం చేయకపోవడంతో వ్యాపారులు తికమకపడ్డారు. గడిచిన ఐదేళ్ల పాటు విక్రయించిన బ్రాండ్‌లలో అత్యధికం ఈసారి లేవు. వాటి స్థానంలో మద్యం ప్రియులు మెచ్చే బ్రాండ్‌లను విక్రయాలకు సిద్ధం చేస్తున్నారు. ధరలు గతంకంటే భారీగా తగ్గుతాయనే ప్రచారం సాగినందున ఏ స్థాయిలో తగ్గుతాయనే దానిపైనే అందరూ తర్జనభర్జనపడ్డారు. ఇప్పటి వరకు ప్రభుత్వ దుకాణాల్లో పనిచేసిన సిబ్బంది తమకు న్యాయం చేయాల్సిందేనంటూ నిరసనలకు దిగినా సర్కారు మాత్రం మౌనం దాల్చింది. దీంతో వీరిలో కొందరిని తాజాగా కొత్త మద్యం దుకాణాల్లో తిరిగి తీసుకోబోతున్నారు.

అత్యుత్సాహం

గడిచిన పక్షం రోజులుగా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో నిల్వలు తగ్గిస్తూ వచ్చారు. 'జె' బ్రాండ్ రకాలన్నీ పక్షానికి ముందే నిలిచిపోయాయి. కేవలం ఒకటి రెండు బ్రాండ్‌లతోనే కొత్త దుకాణాలు వచ్చేంత వరకు నామమాత్రంగా విక్రయాలు జరిగాయి. కొత్తగా వస్తున్న ప్రైవేటు దుకాణాలపై మద్యం ప్రియులు అత్యుత్సాహంతో ఉన్నారు. తమకు కావాల్సిన బ్రాండ్‌లు, బీర్‌లు అందుబాటు లోకి వస్తాయంటూ ఉల్లాసంగా చర్చ పెడుతున్నారు. గడిచిన 15 రోజులుగా బార్‌లకు వెళ్లి జేబులు ఖాళీ చేసుకోవాల్సి వచ్చిందని, కొత్త సరుకు వస్తుందని సంబరపడుతున్నారు. మందు బాబుల కోరుకునే బ్రాండ్‌లను కొత్త దుకాణాల్లోకి చేరుస్తారా, లేక కొన్నింటికే పరిమిత మవుతాయా అనేది నేడు తేలబోతుంది.

రాయబేరాలు..

నేటి నుంచి ఆరంభంకానున్న మద్యం వ్యాపారంలో భాగస్వాములు కావాలని ఎక్కువ మంది ఆశపడ్డారు. లక్షలాది రూపాయలతో దరఖాస్తు చేసుకున్నా లాటరీతో పరిస్థితి తారుమారు కావడంతో సోమవారం నుంచే అనేకమంది సర్దుబాటు.. రాయబారాలకు తెరలేపారు. ఈ వ్యవహారంలో ఎక్కువగా జోక్యం చేసుకుంటున్నారని విమర్శలు రాకుండా అధికార పక్ష ఎమ్మెల్యేలు జాగ్రత్తపడ్డారు. దుకాణ లైసెన్సు దక్కిన వారితో నేరుగా మాట్లాడుకోవాలని, తమ వద్దకు రావద్దంటూ ముఖ్య అనుచరులందరికీ తేల్చి చెప్పారు. కొన్నిచోట్ల మాత్రం మీ వ్యాపారం మీరు చేసుకోండి.. ఐదు పైసలో, పది పైసలో వాటా మావాళ్లకి ఇచ్చేలా చూడండి, కలిసిమెలిసి వ్యాపారం చేసుకోండి వివాదానికి దిగవద్దంటూ పరోక్ష సంకేతాలు పంపారు. జిల్లా వ్యాప్తంగా గడిచిన 48 గంటలపాటు ఇదే తంతు నడిచింది. లాటరీలో ఎమ్మెల్యేలు అనుకూలురకు ప్రతికూల పరిస్థితులు ఎదురుకావడంతో సర్దుబాటు ప్రయత్నాలపై దృష్టి సారించారు. ముందు దుకాణాలు ఆరంభించండి, తరువాత మాట్లాడుకుందామంటూ కొన్ని ప్రాంతాల్లో వెసులుబాటు ఇచ్చినట్టు చెబుతున్నారు. ప్రత్యేకించి దుకాణాల ఏర్పాటులో ఆటంకాలు లేకుండా సజావుగా జరిగేలా సహకరించాలని దుకాణదారులు ఎమ్మెల్యేలు, వారి ముఖ్య అనుచరులకు మొరపెట్టుకోవాల్సి వచ్చింది.

ఆలయం వద్ద మద్యం దుకాణం వద్దు

చింతలపూడి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బైపాస్ రోడ్డులో చెరువు, రామాలయం పక్కన మద్యం దుకాణానికి అనుమతి ఇవ్వవద్దని భక్తులు, రైతులు అభ్యంతరం తెలిపారు. తహసీల్దార్, ఎక్సైజ్ సీఐ, మున్సిపల్ కమిషనర్‌కు రైతులు ఆలపాటి పట్టాభి, చిట్లూరి అంజిబాబు, కె.రాజారత్నం ఫిర్యాదు చేశారు. గతంలో దుకాణం ఏర్పాటుపై అభ్యంతరం వ్యక్తం చేసినా అధికారులు పట్టించుకోలేదన్నారు. మద్యం దుకాణ వ్యర్థాలు చెరువులో వేస్తున్నారన్నారు. పక్కన సీతారామ ఆలయం ఉందని, ఆలయం వద్ద రాత్రివేళ మందు బాబులు ఇష్టానుసారం ఉంటున్నారన్నారు. ఇదే మార్గంలో బాలికల పాఠశాల ఉందని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. బైపాస్ రోడ్డులో వాహనాల రాకపోకలతో ప్రమాదాల జరుగుతున్నాయని, ఇక్కడ మద్యం దుకాణానికి అధికారులు అనుమతి ఇవ్వవద్దని కోరారు.

ఎమ్మార్పీ కంటే అధిక ధరకు విక్రయాలు

ఏలూరు క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మద్యం దుకాణాల్లో మంగళవారం ఎంఆర్‌పీ కంటే అధిక ధరకు మద్యం విక్రయాలు యథేచ్ఛగా సాగించారు. జిల్లా కేంద్రం ఏలూరులోని పలు మద్యం దుకాణాల్లో ఎంఆర్‌పీ కంటే రూ. 10, 20 ఎక్కువకు విక్రయించారు. మంగళవారం రాత్రితో ప్రభుత్వ మద్యం దుకాణాలకు గడువు ముగియడంతో సిబ్బంది సందట్లో సడేమియా అన్నట్లు వ్యవహరించారు. మరోపక్క ఎక్సైజ్ అధికారులు నూతన మద్యం దుకాణాల ఏర్పాట్లల్లో బిజీగా ఉండడం, ఈ దుకాణాలను పట్టించుకోకపోవడంతో సిబ్బందికి కలిసి వచ్చింది. అధిక ధరలకు మద్యం కొనుగోలు చేయాల్సి వచ్చిందని పలువురు మందు బాబులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులే వసూలు చేయమన్నారని మద్యం షాపుల్లో సిబ్బంది చెప్పడం గమనార్హం. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ మద్యం షాపులోనే ఇలా ఉంటే బుధవారం నుంచి ప్రారంభమయ్యే ప్రైవేటు మద్యం దుకాణాల్లో ధరలు ఏవిధంగా నియంత్రిస్తారో..!

చారిత్రక వైభవం

భూమిలో పాతుకుపోయిన పెద్ద పాలరాయి శివలింగం, చుట్టూ గర్భాలయ నిర్మాణం పదిహేనేళ్ల క్రితం తవ్వకాల్లో బయటపడింది.



6

పురాతన కట్టడం

1904లో బంగాళా పెంకు, రాతితో కట్టిన ఈ భవనం వయసు 120 ఏళ్లు.. ఇప్పటికీ చెక్కు చెదరకుండా పటిష్ఠంగా ఉంది. బ్రిటీష్ అధికారులు ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు విడిది భవనంగా ఉపయోగించేవారు.





నేటి నుంచి లాసెట్ కౌన్సెలింగ్

2024-25 విద్యా సంవత్సరానికి న్యాయశాస్త్ర కోర్సుల్లో చేరేందుకు నిర్వహించే లాసెట్ కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ బుధవారం నుంచి మొదలై 20వ తేదీ వరకు కొనసాగుతుంది. 7లో..



ఇన్‌చార్జ్ మంత్రులుగా నాదెండ్ల, గొట్టిపాటి

పశ్చిమ గోదావరి జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రిగా గొట్టిపాటి రవికుమార్‌ను, ఏలూరు జిల్లాకు నాదెండ్ల మనోహర్‌ను, తూర్పు గోదావరి, కర్నూలు జిల్లాలకు నిమ్మల రామానాయుడులను ప్రభుత్వం నియమించింది. 6లో



వాతావరణం

- బలపడనున్న అల్పపీడనం
- వాతావరణ శాఖ హెచ్చరిక
- జిల్లాలో అక్కడక్కడా వర్షాలు
- రైతుల ఉరుకులు పరుగులు

ఏలూరు సిటీ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి):బంగాళా ఖాతంలో అల్పపీడనం బలపడనుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. వర్షాలు కురుస్తాయని ఐఎండీ హెచ్చరికల నేపథ్యంలో రైతులు వరి పంటను దక్కించుకోడానికి ఉరుకులు పరుగులు పెడుతున్నారు. జిల్లాలో 1.91 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో కోత దశలో ఉంది. కొన్ని ప్రాంతాల్లో కోతలు కూడా ఆరంభించారు. బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి కారణంగా వర్షాలు భారీగా కురిస్తే ఇబ్బందులు తప్పవన్న ఆందోళన చెందుతున్నారు. వర్షాలు, ఈదురుగాలుల ప్రభావంతో కోసిన వరి పంట కూడా దెబ్బతింటుందని, నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటను రక్షించుకోడానికి జాగ్రత్తలను వ్యవసాయ శాఖ విడుదల చేసింది. ఇటీవల భారీ వర్షాలు, కొల్లేరు, బుడ మేరు ముంపుతో వరి పంట దెబ్బతిన్న పరిస్థితులు ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో పంటలు దెబ్బతిన్న రైతులు ఇతర పంటల సాగు చేశారు. దీంతో సాధారణ విస్తీర్ణం కన్నా సార్వా వరి సాగు విస్తీర్ణం తగ్గిందని చెబుతున్నారు. పంట చేతికి వచ్చే సమయంలో వాయుగుండం, అల్ప పీడనం, తుఫాన్‌తో దిగుబడులు పూర్తిగా పడిపోతాయని రైతులు చెబుతున్నారు. ఇప్పటికే వివిధ కారణాల వల్ల సార్వా వరి సాగు చేయటం భారంగా మారింది. అయితే వ్యవసాయాన్నే నమ్ముకున్న పరిస్థితలలో తప్పనిసరిగా వరి సాగు చేయాల్సి వస్తోంది. ఎప్పటికప్పుడు ప్రకృతి వైపరీత్యాలు వరి పంటను దెబ్బ తీస్తున్నాయని, ఈ పరిస్థితులలో వ్యవసాయం చేయటం కడు భారంగా పరిణమిస్తోందని పలువురు రైతులు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు.

జిల్లాలో వర్షాలు

అల్పపీడన ప్రభావంతో జిల్లాలో వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. బుధవారం వర్షాల తీవ్రత ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. మరో మూడు రోజుల పాటు వర్షాల ప్రభావం ఉంటుందని ఆ హెచ్చరికల్లో పేర్కొనటం జరిగింది. గడచిన 24 గంటల్లో జిల్లాలో అత్యధికంగా భీమడోలు మండలంలో 38.2 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదు కాగా జిల్లాలో సరాసరి వర్షపాతం 10.8 మిల్లీమీటర్లుగా నమోదైంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం బలపడితే వాయుగుండం, ఆతర్వాత తుఫానుగా మారుతుందని వాతావరణ శాఖ చేస్తున్న హెచ్చరికలతో భారీగా వర్షాలు కురిసే అవకాశం ఉంది.

వ్యవసాయ శాఖ సూచన

- అధిక వర్షాల నేపథ్యంలో వ్యవసాయ శాఖ జిల్లా అధికారి షేక్ హబీబ్ బాషా రైతులకు పలు సూచనలు చేశారు. వీటిని పాటించాలని కోరారు.
- సన్న రకాలైన పీఆర్ 126, ఎస్ఎల్ 10 మొదలైన రకాలు 213 హెక్టార్ల వరకు కోతలు జరిగాయి.
- ధాన్యం తడవకుండా సురక్షితమైన ప్రదేశాల్లో ఉంచుకోవాలి.
- వర్షాలు అధికంగా వున్న ప్రదేశాల్లో ఖరీఫ్ కోతలు పూర్తిగా నిలిపివేయాలి.
- పొలంలో నీరు నిలవకుండా బయటకు పోయే విధంగా డ్రైనేజి పారుదల వ్యవస్థ ఏర్పాట్లు చేయాలి.
- అధికంగా వర్షం పడితే వెంటనే ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని కంకులపై పడే విధంగా పిచికారీ చేసి, పక్వానికి వచ్చిన పంటను సంరక్షణ చర్యలు తీసుకోవాలి.



నేత్ర వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ హుస్సేన్ అహ్మద్ (ఫైల్)

ఇంటింటికీ వైద్య సేవలు..

జీవితం చివరిలో ఆరోగ్య సహకరించని సమయంలో ఎవరో ఒకరు తోడుండాలి. ప్రస్తుత సమాజంలో ఎవరికి వారే అన్నట్టుగా ఉంది. తల్లిదండ్రులను, తోబుట్టువులను కూడా పట్టించుకునే పరిస్థితి లేదు. ఏ తోడూ లేని అభాగ్యులకు, పేదలకు మేమున్నా మంటూ ఇంటింటికీ వెళ్లి ఉచితంగా వైద్యం చేస్తున్నారు తణుకు పట్టణానికి చెందిన సీనియర్ వైద్యులు కొందరు.. స్తోమత లేనికి వారికి వారే ఉచితంగా మందులు అందిస్తున్నారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా సేవలు అందిస్తున్నారు. ప్రతి ఆదివారం ప్రముఖ నేత్ర వైద్యుడు హుస్సేన్ అహ్మద్, ఇతర వైద్యులు ఇళ్ల వద్ద మంచానికే పరిమితమైన వారి వద్దకు వెళ్లి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందిస్తున్నారు. సేవ చేయడంలోనే ఆనందం ఉంది.. అందుకే వయసు మీద పడుతున్నా మాకు తోచిన విధంగా వైద్య సేవలు అందిస్తున్నామని, భవిష్యత్‌లో కూడా మరిన్ని కార్యక్రమాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని సీనియర్ వైద్యులు చెప్తున్నారు..

- తణుకు

సేవే దైవం



వైద్యం..ఉచితం

వైద్యం ఖరీదైపోయింది..చిన్న జ్వరమొచ్చినా వేలల్లో సొమ్ములు ఎగిరిపోతున్నాయి.. పేద, మధ్య తరగతికి ఆసుపత్రి ఖర్చులు తలకు మించిన భారమవుతున్నాయి..ఇటువంటి పరిస్థితిలో అలంపురం వెంకటరమణ సేవా చారిటబుల్ ట్రస్టు ఆసుపత్రి బాసటగా నిలుస్తున్నది. నిరుపేదలకు, ఆపదలో ఉన్న వారికి ఉచితంగా వైద్యం అందిస్తూ వారికి బాసటగా నిలుస్తోంది. 2005లో అలంపురానికి చెందిన కొలనువాడ పెదకృష్ణంరాజు ఈ ట్రస్టును ఏర్పాటు చేసి ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నారు..

పేదలకు బాసటగా అలంపురం

శ్రీవెంకట రమణ సేవా చారిటబుల్ ట్రస్టు

వివిధ ఆసుపత్రుల నుంచి వైద్యుల రాక

ఉచితంగా వైద్య సేవలు

అలంపురం ట్రస్టు ఆసుపత్రిలో ప్రతీ రోజు డాక్టర్ సునీల్, డాక్టర్ ప్రియాంకలు అందు బాటులో ఉండి అన్ని రకాల జనరల్ సమస్య లకు చికిత్స అందిస్తారు. విష్ణు దంత వైద్యశాల నుంచి వచ్చిన వైద్యులు ఉచితంగా చికిత్స అందిస్తారు. ప్రతీ గురువారం ఇక్కడి నుంచి భీమవరం విష్ణుదంత కళాశాలకు ఉచిత బస్సు సదుపాయం ఉంటుంది. అవసరమైనవారిని అక్కడ తీసుకువెళ్లి ఉచితంగా చికిత్స అందిస్తారు. డాక్టర్ జే.సాగర్‌బాబు ఫిజియో థెరపీ సేవలు అందిస్తారు. దీనికి సంబంధించి అన్ని రకాల మిషనరీ సదుపాయం కూడా ఆసుపత్రిలో ఏర్పాటు చేశారు.

ఉచిత వైద్య సేవలు ఇవీ..

రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రి నుంచి ప్రతీ గురువారం ప్రత్యేక వైద్యులు వస్తారు. నెలలో ప్రతీ మొదటి, మూడవ గురువారాలు ఎముకలు, కీళ్ళు, జనరల్ సర్జన్, చర్మవ్యాధులు, ఊపిరి తిత్తులు, చెవి, ముక్కు, గొంతు సంబంధిత వైద్యులు విచ్చేసి వైద్య సేవలందిస్తారు. ప్రతీ రెండవ, నాల్గవ గురువారాలు జనరల్ మెడిసిన్, కాన్సర్, గైనకాలజిస్ట్, చిన్నపిల్లలు , గుండె సంబంధిత వ్యాధి నిపుణులు వస్తారు. ప్రతీ శని, ఆది వారాలలో రాజేశ్వరీ రామకృష్ణన్ లయన్స్ నేత్రవైద్యశాల నుంచి కంటి వైద్యనిపుణులు వచ్చి కంటి పరీక్షలు నిర్వహిస్తారు. అవసర మైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తారు. కళ్ళ జోళ్ళు అవసరమైన వారికి రాయితీపై అతి తక్కువ ధరలో అందజేస్తారు. ప్రతీ నెల మూడవ ఆదివారం విజయవాడ నుంచి ప్రముఖ న్యూరోసర్జన్ డాక్టర్ తీగల రమేష్ వస్తారు. తల, మెదడు, వెన్నుముక, నరాలకు సంబంధించి చికిత్స అందిస్తారు. రెండు నెలలకు ఒకసారి హైదారాబాద్ నుంచి షుగర్ స్పెషలిస్టు డాక్టర్ రాజశేఖర్ విచ్చేస్తారు. ఈ ఆసుపత్రిలో షుగర్, కిడ్నీ, లివర్ తదితర రక్త పరీక్షలన్నీ ఉచితంగా నిర్వహిస్తారు. ఈసీజీ, టూడీ ఎకో, అల్ట్రాసౌండ్ పరీక్షలు జరుపుతారు.

ఉచిత భోజన సదుపాయం

ట్రస్టు ఆసుపత్రికి వచ్చే రోగులు మధ్యాహ్నం భోజనం గురించి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ట్రస్టు ఆసుపత్రి వద్దే ఉచిత భోజన సదుపాయం కూడా ఏర్పాటు చేశారు. ఆసుపత్రికి వచ్చి ప్రతీఒక్కరూ ఇక్కడే ఉచితంగా భోజనం చేసి వెళ్ళేలా ఏర్పాటు చేశారు. దీనికోసం ప్రత్యేక సిబ్బందిని కూడా నియమించారు

జీఎస్ఎల్‌కు బస్సు

మెరుగైన వైద్యం కోసం రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రికి వెళ్లేందుకు ప్రతీ శుక్రవారం ఉచిత బస్సు సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. ట్రస్టు ఆసుపత్రి నుంచి వెళ్లిన రోగులకు ఆరోగ్యశ్రీలో రాని ఆపరేషన్లు గాని టెస్టులు గాని ఏమైనా ఉంటే 25 శాతం రాయితీ కల్పిస్తారు. వైద్యం కోసం వెళ్లేవారు తమ వెంట రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు, పాత మెడికల్ రిపోర్టులు తీసుకువెళ్లాలి.

-పెంటపాడు

ట్రస్టు పేరున 40 ఎకరాలు



నలుగురికి సాయపడడంలో ఆనందం ఉంటుంది. 2001 నుంచే సేవా కార్య క్రమాలు చేపట్టాను. కంటి చూపులేని వృద్ధులను నిడదవోలు రాజేశ్వరీ రామకృష్ణన్ కంటి ఆసుపత్రికి పంపించి ఉచితంగా కంటి ఆపరేషన్ చేయించాను. మా కళ్ళు కన పడుతున్నాయని ఆనందంతో వారు నన్ను మెచ్చుకోవడం నా కంట్లో నీళ్ల తిరిగేలా చేశాయి. అప్పుడే నిర్ణయించు కున్నాను. ప్రజల కోసం ఉచితంగా వైద్య సేవలు ప్రారంభించాలని.. 2005లో ట్రస్టు రిజిస్టర్ చేయించాను. అప్పటి నుంచి నిరంతరంగా వైద్య సేవలు కొనసాగిస్తు న్నాను. నేను ఉన్నా లేక పోయినా ట్రస్టు సేవలు ఆగకూడదన్న ఉద్దేశంలో ట్రస్టు పేరు మీద 40 ఎకరాలు రిజిస్ట్రేషన్ చేయిం చాను. కొత్తగా నాలుగున్నర ఎకరాల పొలం కూడా కొన్నాను. త్వరలో ఇక్కడ 100 పడకల ఆసుపత్రి, వేంకటేశ్వరస్వామి మందిరం, కంప్యూటర్, మెకానిక్, టైలరింగ్ తదితర వాటిలో ఉచిత శిక్షణ కేంద్రం, అనా దాశ్రమం వంటివి నిర్మించాలని నిర్ణయిం చుకున్నాను. ఇది నా చిరకాల కోరిక. నేను న్నంతవరకు ప్రజలకు సేవ చేస్తూనే ఉంటాను.

-కొలనువాడ పెదకృష్ణం రాజు, ట్రస్టు చైర్మన్

రేపు ప్రత్యేక వైద్యుల రాక

అలంపురం ట్రస్టు ఆసుపత్రికి ఈ నెల 17న రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రి నుంచి ప్రత్యేక వైద్యులు వస్తున్నట్టు ట్రస్టు చైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు తెలిపారు. ఎము కలు, కీళ్ళు, జనరల్ సర్జన్, చర్మ వ్యాధులు, ఊపిరితిత్తులు, చెవి, ముక్కుగొంతు సం బంధ వైద్యులు ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తారన్నారు. అవసరమైన వారికి ఈసీజీ, టూడీ ఎకో, అల్ట్రాసౌండ్ పరీక్షలు ఉచితంగా చేస్తారని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



120 ఏళ్లయినా చెక్కు చెదరలే..

చింతలపూడి తాలూకా కార్యాలయ ఆవరణలో ఉన్న ఈ భవనానికి 120 ఏళ్ళు. 1904లో బంగాళా పెంకుతో నిర్మించిన ఈ రాతికట్టడం ఇప్పటికీ చెక్కు చెదరకుండా పటిష్ఠంగా ఉంది. బ్రిటీష్ పరిపాలనలో ఇది నిర్మించబడింది. అప్పట్లో బ్రిటీష్ అధికారులు ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు విడిది భవనంగా ఉప యోగించేవారు. స్వాతంత్ర్యం అనంతరం 1964లో ఈ భవనంలో తాలూకా మున్సిబ్ మేజిస్ట్రేట్ కోర్టు ఏర్పాటు చేశారు. 2007 వరకు నిర్వహించారు. కోర్టు ఆవరణలో ఈ భవనం ఎంతో హుందాగా ఉండేది. ఆవరణలోకి ఎవరు రావాలన్నా వాహనం దిగివచ్చేవారు. అంత గౌరవంగా ఉండేది. కోర్టు మరో చోటుకి మారిపోయింది. అప్పటి నుంచి ఈ భవనాన్ని రెవెన్యూ అధికారులు ఉపయోగిస్తున్నారు. ఎన్నికల సమయంలో రిటర్నింగ్ అధికారి కార్యాలయంగాను, సాధారణ రోజుల్లో వీడియో కాన్ఫరెన్స్ హాలుగా వినియోగిస్తున్నారు. ఈ భవనం చూడటానికి క్యాంపస్ లోకి వచ్చే ప్రతివారు ఈ భవనం పటిష్ఠత గురించి చర్చించుకుంటారు.

- చింతలపూడి





ఇన్‌చార్జి మంత్రులుగా మనోహర్, గొట్టిపాటి

నిమ్మలకు రెండు జిల్లాల బాధ్యతలు

(భీమవరం/ఏలూరు-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వం జిల్లాలకు ఇన్‌చార్జ్‌ల మంత్రు లను నియమించింది. ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను పశ్చిమ గోదావరి జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రిగా, ఏలూరు జిల్లాకు పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనో హర్‌లను నియమిస్తూ ప్రభుత్వం బాధ్య తలు అప్పగించింది. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులను సమీక్షించి దిశానిర్దేశం చేసే బాధ్యతలను ఇన్‌ఛార్జ్ మంత్రులు నిర్వహించనున్నారు. ప్రతి ప్రభుత్వంలోనూ జిల్లాకు ఇన్‌చార్జ్‌ను నియమించడం ఆన వాయితీగా వస్తోంది. సంక్షేమపథకాలు, అభి వృద్ధి పనులను పరిశీలించి పర్యవేక్షిం చడంలో ఇన్‌ఛార్జ్ మంత్రులు కీలకంగా వ్యవహరిస్తారు. జిల్లాకు ఇన్‌చార్జ్‌గా వ్యవహ రించనున్న గొట్టిపాటి రవికుమార్‌కు పల్నాడు జిల్లాకు కూడా ఇన్‌చార్జ్‌గా నియ మించింది. సీనియర్లకు మాత్రమే రెండు జిల్లాలకు బాధ్యతలు అప్పగించారు. ఆ క్రమంలోనే జిల్లా నుంచి జల వనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తూర్పు గోదావరితో పాటు, కర్నూలు జిల్లాకు కూడా ప్రాతినిధ్యం వహించనున్నారు. సమర్థవం తంగా పనిచేస్తారన్న నమ్మకంతో నిమ్మలకు రెండు జిల్లాలకు ఇన్‌చార్జ్ బాధ్యతలను అప్పగించింది. ఏలూరు జిల్లా రాజకీయా లతో సత్సం బంధాలు ఉండడం, వివాద రహితుడిగా పేరొందిన మనోహర్‌ను నియ మించడం అటు టీడీపీ, ఇటు జనసేనలో హర్షం వ్యక్తమైంది.



రాజమహేంద్రవరంలో జరిగిన ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్.. చిత్రంలో మంత్రులు అచ్చెన్నాయుడు, దుర్గేష్, నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యేలు

కూటమిగా పనిచేద్దాం..ఎమ్మెల్సీని గెలిపిద్దాం

రాజమహేంద్రవరంలో రౌండ్ టేబుల్ సమావేశం


రాజమహేంద్రవరం, అక్టోబరు15 (ఆంధ్ర జ్యోతి) : వచ్చే ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో జరిగే ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ స్థానాన్ని కూటమిగా పనిచేసి గెలిపిద్దామని కూటమి నేతలు ప్రతినబూనారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు పర్యవేక్షణలో మంజీరా ఇంట ర్నేషనల్ హోటల్‌లో మంగళవారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ మాట్లాడారు. కూటమి అభ్యర్థి గెలవడానికి అందరి సహ కారం కావాలన్నారు. గ్రాడ్యు యేట్లు అందరినీ నవంబరు 6వ తేదీలోపు ఓటర్లుగా నమోదు చేయించాలన్నారు. రేపటి నుంచే నమోదు మొదలు పెట్టాలన్నారు.రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో గోదావరి జిల్లాల ప్రజలు 34 ఎమ్మెల్యేలు, 5 ఎంపీ స్థానాలను ఇచ్చారు. మన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ ఎమ్మెల్సీ ఎన్నికలే మొదటి ఎన్నికలు. గత ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితాతో సంబంధం లేదని మళ్లీ ఓటర్లను చేర్పించాలన్నారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయ స్ఫూర్తిని ఎమ్మెల్సీ ఎన్నికలో కూడా కొనసాగించాలన్నారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లా డుతూ గతంలో వైసీపీ అధికారంలో ఉండ గానే విద్యావంతులైన పట్టభద్రులు మూడు ఎమ్మెల్సీ స్థానాలను టీడీపీకి ఇచ్చారని, ఇక్కడ కూడా గెలిచి అదే చరిత్రను కొనసాగించా లన్నారు. మరోమంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ కలసి పనిచేసి ఎమ్మెల్సీ అభ్య ర్థిని గెలిపిద్దామన్నారు. ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ మాట్లాడుతూ అందరం ఐక్యంగా కలసి పనిచేసి అభ్యర్థిని గెలిపిద్దామ న్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ ఓటర్ల నమోదు చేయించేలోపు అభ్యర్థిని ప్రకటిస్తే మంచిదని సూచించారు.ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, నల్లమిల్లి రామ కృష్ణారెడ్డి, బత్తుల బలరామకృష్ణ, ముప్పిడి వేంకటేశ్వరరావు. చింతమనేని ప్రభాకర్, పంతం నానాజీ, సృజనా రంగారావు, జనసేన ఎమ్మెల్సీ హరిప్రసాద్, మాజీ ఎమ్మెల్యేలు మంతెన రామరాజు, బూరుగుపల్లి శేషారావు, బొడ్డు వెంకటరమణ చౌదరి, కూటమి నేతలు ఆదిరెడ్డి అప్పారావు, గన్నికృష్ణ, తోట సుధీర్, అనుశ్రీ సత్యనారాయణ, కాశిరాజు, పాకా సత్య నారాయణ, బొమ్ముల దత్తు, రంగబాబు పాల్గొన్నారు.



పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా గణాంక అధికారి విశ్వేశ్వర ప్రసాద్

యాప్‌తో పాటు రిజిస్టర్లు, రికార్డులు మెయింటెన్ చేయాలి

పాలకొల్లు రూరల్, అక్టోబరు 14 (ఆంధ్ర జ్యోతి) : వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఆన్‌లైన్ యాప్‌లతో పాటు రిజిస్టర్లు, రికా ర్డులను కూడా మెయింటైన్ చేయాలని జిల్లా గణాంక అధికారి విశ్వేశ్వర ప్రసాద్ అన్నారు. లంకలకోడేరు పీహెచ్‌సీలో జిల్లా ఎన్ హెచ్‌ఎం టాస్క్‌ఫోర్సు టీం రికార్డులు, రిజి స్టర్లు, ఆన్‌లైన్ డేటాను పరిశీలించారు. తప్పు లను సరి చేయించి తగిన విధంగా రికార్డు లను రూపొందించాలని సూచనలు చేశారు. దగ్గరలోని జడ్పీ హైస్కూల్ విద్యా ర్థులు 30 మందికి, ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఐదుగురు, గర్భిణులు ఐదుగురికి రక్తహీనత పరీక్షలు చేశారు. రక్తం తక్కువ ఉన్నవారికి పోష కాహారం, ఐరన్ మాత్రలు తీసుకోవా లని సూచించారు. పీహెచ్‌సీ డాక్టర్ అడ్డాల ప్రతాప్ కుమార్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, సిబ్బంది ఎలిజిబెత్, అమలేశ్వరరావు, డి.కమల, శిరీష, మార్త, రూపాదేవి, శ్రీనివాస్, ఆశాలు లక్ష్మీ, రాధ తదితరులు ఉన్నారు



విద్యార్థులతో మాట్లాడుతున్న భీమవరం సివిల్ న్యాయాధికారి అప్పలస్వామి

హాస్టళ్ళను తనిఖీ చేసిన న్యాయాధికారులు

భీమవరం క్రైం, అక్టోబరు 15 (ఆంధ్ర జ్యోతి) : రాష్ట్ర ,జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు భీమవరం మండల న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో భీమవరం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) బి.అప్పల స్వామి భీమవరం పరిసర ప్రాంతాల్లో ఉన్న హాస్టళ్ళను తనిఖీ చేశారు. ఉండి పెదపే టలో ఉన్న ఎస్సీ గవర్నమెంట్ బాలికల హాస్టల్‌ను సందర్శించి పిల్లలకు అందుతున్న సౌకర్యాల గురించి, అవసరమైన సదుపా యాల గురించి పిల్లలను, వార్డెన్లను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ పరిసరాలను, వంట గది, డైనింగ్ హాల్, బెడ్‌రూం, వాష్ రూమ్‌లను పరిశీలించారు. ప్యానల్ న్యాయ వాదులు అంబేద్కర్, కె.జ్యోతి, ఎంబి భవాని, బి.సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

నన్నయలో పీజీ ప్రవేశాలకు 17న స్పాట్ కౌన్సెలింగ్

దివాన్‌చెరువు, అక్టోబరు 15 (ఆంధ్ర జ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి న ఎం.ఎ, ఎం.కామ్, ఎంపీఈడీ, ఎం.ఎస్సీ కోర్సుల్లోని భర్తీ చేయని సీట్లుకు ఈ నెల 17న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు మం గళవారం తెలిపారు. ఏపీ పీజీ సెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు మాత్రమే స్పా ట్ కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. న న్నయ రాజమహేంద్రవరం, కాకినాడ, తాడే పల్లిగూడెం ప్రాంగణాల్లో సంబంధిత సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. విశ్వ విద్యాలయంలోని డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తారన్నా రు. అభ్యర్థులు 17వ తేదీ ఉదయం 9.30 నుంచి 11 గంటలలోపు రిజిస్ట్రేషన్ చేసుకో వాలని సూచించారు.

తుఫాన్ హెచ్చరికలతో రైతుల గుండెల్లో రైళ్లు..

చాట్రాయి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తుఫాను హెచ్చరికల నేపథ్యంలో రైతుల గుండెల్లో గుబులు పుడుతోంది. మండలంలో ముందుగా వేసిన 1010 రకం వరి పంట కోతలు జరుగుతుండగా, 1224 వరి రకం 10-15 రోజుల్లో కోత దశలో ఉంది. తుఫాను భయంతో కోతకు వచ్చిన వరి పంటను యంత్రాలతో హడావుడిగా కోస్తున్నారు. భారీ వర్షాలు కురిస్తే వరిపంట నేలవాలి తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో మండ లంలో 112 సాగునీటి చెరువులు, తమ్మిలేరు రిజర్వాయర్ ప్రాజెక్టు కింద 12 వేల ఎకరాల్లో వరిసాగు జరిగింది. వాతావరణం అనుకూలంగా ఉండటంతో ఈ ఏడాది మంచి దిగుబడులు వస్తాయని రైతులు అంటున్నారు. అల్పపీడనం ప్రభావంతో రెండు రోజుల నుంచి ఆకాశం మేఘా వృతమై జల్లులు పడుతుండటంతో రైతుల కంటి మీద కునుకు ఉండటం లేదు. తుఫాను గండం నుంచి కాపాడాలని రైతులు దేవుళ్ళకు మొక్కుకుంటున్నారు.

ట్రిపుల్ ఐటీ ఎంఓయూ

నూజివీడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి పెరబుల్ అనే సంస్థతో నూజివీడు ట్రిపుల్ ఐటీ మంగళవారం ఎంవోయూ కుదుర్చుకుంది. ఈ కార్య క్రమంలో భాగంగా డేటా సెంటర్ వ్యవస్థాపకులు ప్రణవమూర్తి, జోసఫ్, సురేంద్రలు నూజివీడు ట్రిపుల్ ఐటీని సందర్శించారు. విద్యార్థుల్లో నైపుణ్యాభి వృద్ధిని, కోడింగ్ స్కిల్స్‌ను పరిశీలించారు. అనంతరం ట్రిపుల్ ఐటీలోని 15 మంది విద్యార్థులను లాంగ్ టెర్మ్ ఇంటర్న్‌షిప్‌కు ఎంపిక చేశారు. ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ అమ రేంద్రకుమార్, ఏవో లక్ష్మణ్ పాల్గొన్నారు.

చారిత్రక వైభవం



వివాహమైనా, జాతరైనా ఏ మంచి పనైనా ఊరికి దూరంగా ఉన్న మల్లయ్యపోడు నుంచి ప్రారంభించడం అక్కడి ఆచారం. కానీ అక్కడ ఒక పెద్ద శివాలయం ఉందనే సంగతి పూర్వీకుల మాటల్లో తప్ప వారెప్పుడూ చూసి ఎరుగరు. 15 సంవత్సరాల క్రితం జరిగిన ఒక సంఘటన కొన్ని వాస్తవాలను గ్రామస్థులకు పరిచయం చేసింది.. -నూజివీడు టౌన్



చరిత్రకు దొరకని ఆలయం



నూజివీడు మండలం రావిచర్ల గ్రామంలోని మల్లయ్యపోడులో పదిహేనేళ్ల క్రితం వ్యవసాయ భూమిలో పంటల సాగుకు వేసిన పైప్‌లైన్ నీరు ఒక రాయిపై ధారాళంగా పారింది. శివునికి జలాభి షేకం జరిగిన విధంగా క్రమక్రమంగా భూమిలో పాతుకుపోయిన పెద్ద పాలరాయి శివలింగం బయటపడింది. శివలింగం చుట్టూ గర్భాలయం నిర్మాణం ఉన్న విధంగా ఇటుకరాళ్ళ నిర్మాణం కనిపించింది. పూర్వీకులు చెప్పినట్టుగా అత్యంత పురాతన ఆలయం అక్కడ ఉందనే వాదనలకు బలం చేకూరింది. అయితే ఆ ఆలయం ఏ కాలం నాటిది ?? ఎవరు నిర్మించారనేది తేలాలంటే పురావస్తుశాఖ పరిశీలించి చెప్పాలి..

నమ్మకాలు సజీవం

మల్లయ్యపోడులో శిథిల నందీశ్వరునికి, అంజనేయస్వామికి తరతరాలుగా గ్రామస్థులు పూజలు చేస్తున్నారు. తరాలు మారుతున్నా వారి ఆచార వ్యవహారాలను ఆచరిస్తూనే ఉన్నారు. మల్లయ్యపోడులో శిథిలమైన నంది విగ్రహంతో పాటు హను మంతుని విగ్రహం శతాబ్దాలుగా పూజలు అందుకుంటున్నాయి. రావిచర్ల వాసులు ఏ శుభకార్యం తలపెట్టినా అక్కడ పూజలు నిర్వహించి ప్రారంభించేవారు.

బిడ్డ అడ్డం తిరిగిందని చెప్పే నందీశ్వరుడు

రావిచర్ల గ్రామంలో పురుడు పోసుకునే మహిళకు పురుడు కష్టమైతే ఆ ఇంటి పెద్ద మల్లయ్య పోడులోని నందీశ్వరుని వద్దకు వచ్చి ప్రత్యేక పూజలు చేసేవారు. ఈ క్రమంలో నందీశ్వరుని తల పక్కకు తిరిగి ఉంటే దానిని సరి చేసి ఇంటికి తిరిగివెళ్లే సమయానికి మహిళకు సుఖప్రసవం జరిగేదని గ్రామస్థులు చెబుతారు. గంగానమ్మ జాతరతో పాటు ఇతర శుభకార్యాలు ఇక్కడి నుంచే ప్రారంభిస్తారు.

నిట్టనిలువునా చీలి వున్న శివలింగం


వ్యవసాయ భూమిగా ఉన్న పొలంలో నీరు పెట్టగా ఆ నీటి ధారకు శివలింగం బయటపడింది. అది ఒక రాయిగా భావించిన స్థానికులు దాన్ని బయటకు తీద్దామని చుట్టూ దాదాపు ఆరు నుంచి ఏడు అడుగులు తవ్వగా భారీ శివలింగం కనిపించింది. అయితే నిట్ట నిలువుగా పగులకొట్టబడి ఉండటంతో ఎలాగైనా శివ లింగాన్ని బయటకు తీయాలని రైతులు ప్రయత్నించారు. అయినా సాధ్యం కాకపోవడంతో తిరిగి గోతిని పూడ్చి వేశారు. నాటి నుంచి ఆ శివలింగానికే పూజలు చేస్తూ వస్తున్నారు.

నిజాం పాలనలో ఆలయం ధ్వంసం

రావిచర్ల మల్లయ్యపోడులో శివాలయం అత్యంత పురాతన మైనదని గర్భాలయం ఇటుకలతో నిర్మాణం చేసి ఉందని, ఒక్కో ఇటుక అర్థగజం పొడవు, వెడల్పుతో ఉన్నాయని గ్రామస్థులు తెలుపుతున్నారు. అయితే గతంలో రావిచర్ల పక్కనే ఉన్న బోర్వంచ గ్రామం నిజాం పాలనలో ఉందని నిజాం దండయాత్రలతోనే ఈ ఆలయం ధ్వంసమైందని చెబుతున్నారు.

పురావస్తు శాఖ పరిశోధన చేస్తే తెలుస్తుంది

అధికారుల పరిశోధన చేయడం ద్వారా నూజివీడు ప్రాంతంలో శాత వాహనులు లేదా ఆ తరువాత రాజ్యమేలిన రాజుల పాలనలో ఇక్కడ ఆలయం నిర్మించినదా అనేది తెలుస్తుంది. పురావస్తు శాఖ ఆధ్వర్యంలో పరిశోధనలు చే స్తే ఆలయ విశేషాలను వెల్లడి అవుతాయని గ్రామస్తులు కొణతం సాంబశివరావు, మరీదు గోవింద రాజులు, కుటుంబరావు చౌదరి, మరీదు సత్యనారాయణ, చెన్నకేశవరావు, సీతారామయ్య, శ్రీనివాసరావు తదితరులు కోరుతున్నారు.



ఆంజనేయస్వామి విగ్రహం



నిట్‌లో అబ్దుల్‌కలాం చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఆచార్యులు, విద్యార్థులు

అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయం

తాడేపల్లిగూడెం అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయమని ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్‌రెడ్డి అన్నారు. అబ్దుల్ కలాం జయంతిని నిట్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. దినేష్ శంకర్‌రెడ్డి మాట్లాడుతూ అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలను విద్యార్థులందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రక్షణ, అంతరిక్ష పరిశోధన రంగాల్లో శాస్త్రవేత్తగా దేశానికి ఎన్నో విశిష్ట సేవలు అందించిన ఘనత అబ్దుల్ కలాం కే దక్కుతుందన్నారు. ఆయన మాటలు ఎంతో మంది యువతలో చైతన్య స్ఫూర్తిని నింపాయన్నారు. కార్యక్రమంలో డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ జీవీ వీరేష్‌కుమార్, అసోసియేట్ డీన్ డాక్టర్ వీ.సందీప్, విద్యార్థులు పాల్గొన్నారు.

అంతర పంటల సాగుతోనే రైతుల ఆర్థికాభివృద్ధి

ఉద్యాన పంటలను పరిశీలించిన డీసీసీడీ బృందం



కోకో పంటను పరిశీలిస్తున్న డీసీసీడీ బృందం

పెదవేగి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆర్థికంగా ఎదగాలంటే అంతర పంటల సాగు ఒక్కటే మార్గమని కేరళ రాష్ట్రం కొచ్చిన్ కొబ్బరి, కోకో అభివృద్ధి సంచలనాలయమ్(డీసీసీడీ) డైరెక్టర్ డాక్టర్ ఫెమీనా అన్నారు. తాళ్ళగోకవరం, లక్ష్మీపురం గ్రామాల్లో కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటల్లో అంతరంగా సాగు చేస్తున్న కోకో, మిరియం పంటలతోపాటు నాగులదేవునిపాడు గ్రామంలో కోకో ప్రాసెసింగ్ యూనిట్, మోండెలేజ్ కోకో నర్సరీని బృందం పరిశీలించింది. రైతులు అనుసరిస్తున్న సాగు విధానాలు, యాజమాన్య పద్ధతులు మార్కెటింగ్ సౌకర్యాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీసీసీడీ డైరెక్టర్ డాక్టర్ ఫెమీనా మాట్లాడుతూ పెరుగుతున్న పెట్టుబడి వ్యయం, సాగులో ఎదురవుతున్న ఒడిదుడుకులను దృష్టిలో పెట్టుకుని రైతులు కూడా శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంతో పంటలసాగు చేపట్టాలన్నారు. తద్వారా నష్టాల నుంచి బయటపడే అవకాశం ఉంటుందని ఆమె చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఒకే పంట సాగుతో రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందలేరని, దీన్ని అధిగమించడానికి అంతర పంటల సాగు చేపట్టాలని ఆమె సూచించారు. ప్రధానంగా కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటల్లో కోకో, మిరియం వంటి పంటలను సాగుచేస్తే లాభదాయకంగా ఉంటుందని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీడీ ఎస్టీఏ నిఖిల్, ఏలూరు జిల్లా ఉద్యానశాఖాధికారి డాక్టర్ ఆర్.రామ్మోహన్, పెదవేగి మండల ఉద్యానశాఖాధికారిణి కె.రత్నమాల, ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండల ఉద్యానశాఖాధికారి నరేంద్రకుమార్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై

గుజరాత్ ప్రతినిధుల అధ్యయనం

ఏలూరు రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై అధ్యయనం చేయటానికి గుజరాత్ రాష్ట్ర ప్రతినిధులు మంగళవారం వెంకటాపురం గ్రామంలో పర్యటించారు. రైతు సాధికార సంస్థ ప్రదర్శించిన సార్వత్రిక సూత్రాలను వీరు పరిశీలించారు. అందులోని 9 సూత్రాలను సిబ్బంది వివరించారు. అక్కడే ఉన్న వరి కాంపాక్ట్ బ్లాక్‌ను పరిశీలించి ఏగ్రేడ్ వరి పొలం చూసి అందులో ఆదాయ వ్యయాలు, ఎక్స్‌పరిమెంట్ డేటాను పరిశీలించారు. రైతులతో మాట్లాడి ఆదాయ వ్యయాలు, ప్రకృతి వ్యవసాయంలోకి ఎలా ఎందుకు మారారనే మార్పులు గురించి అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో అనుసరిస్తున్న పద్ధతిని చూసి ఆదర్శవంతంగా ఉండటం ఆనందంగా, ఆశ్చర్యంగా ఉందని గుజరాత్ ప్రతినిధులు వారిని అభినందించారు. అనంతరం అమ్మపాలెం గ్రామంలోని కె.రంగయ్య, 5లేయర్ మోడల్‌ను తిలకించారు. జీవ వైవిధ్యం, జీవామృతం కిట్‌ను పరిశీలించారు. పామాయిల్లో వివిధ రకాల పసుపును పెంచటం, డ్రైయింగ్ ప్రాసెసింగ్ యూనిట్లు చూశారు. అనంతరం గుండుగొలను, ద్వారకాతిరుమలలో కషాయాలు, జీవ ఉత్ప్రేరకాలు తయారీ విధానాన్ని పరిశీలించారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు దండగర్ర విద్యార్థులు

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 15, (ఆంధ్రజ్యోతి): దండగర్ర జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు యోగాసన రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ చంద్రశేఖర్ తెలిపారు. ఏలూరు ఇండోర్ స్టేడియం వద్ద మంగళవారం జరిగిన అండర్-14 బాలుర, బాలికల యోగాసన పోటీల్లో ప్రతిభ కనబరిచి గోల్డ్‌మెడల్ సాధించడంతోపాటు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన పసుపులేటి రాజేష్, అర్జుల మానస (మొదటి స్థానం), రాపాక వినయ్, కోట లక్ష్మి (తృతీయ స్థానం)లను, వారికి శిక్షణ ఇచ్చిన బడుగు చంద్రశేఖర్‌ను సర్పంచ్ పిల్లా రాంబాబు, హెచ్‌ఎం సీహెచ్ చంద్రశేఖర్ అభినందించారు.



గోనె సంచులు అందుబాటులో ఉంచాలి

తణుకు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లు త్వరలో ప్రారంభం కానున్నందున గోనె సంచులు అందుబాటులో ఉంచుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి జెడ్. వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం ముద్దాపురం రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ ముందుగానే రైతు సేవా కేంద్రంలో పంట కోతలకు పది రోజులకు ముందుగా గోనె సంచులు అందుబాటులో ఉంచాలని చెప్పారు. జూలైలో పంట నష్టం సొమ్ము తాలూకా నిధులు రెండు వారాల్లోపు విడుదల కావచ్చని రైతులకు తెలిపారు. సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.వి.రమేష్, ఎంవో కె.కుసుమ పాల్గొన్నారు.

కాలుజారి చెరువులో పడి వ్యవసాయ కూలీ మృతి

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 15, (ఆంధ్రజ్యోతి): కాళ్లకు మట్టి ఉందని చెరువులో కడిగేందుకు దిగిన వ్యక్తి జారిపడి మృతి చెందిన ఘటన మాధవరంలో మంగళవారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మాధవరంకు చెందిన జె రాజేష్ (33) వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. మాధవరంలోని చెరువులో కాలుజారి పడిపోయాడు. స్థానికులు అతన్ని బయటకు తీసేందుకు ప్రయత్నించినా రాజేష్‌ను కాపాడలేకపోయారు. రూరల్ ఎస్సై ప్రసాద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు వివరించారు. మృతుడు రాజేష్‌కు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

వృద్ధురాలి అదృశ్యం

భీమడోలు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): భీమడోలు పోలీసు స్టేషన్ పరిధిలోని పూళ్ల గ్రామంలో కుమ్మరికుంట వీధికి చెందిన పచ్చా సీతారత్నం (65) ఈ నెల 14 రాత్రి భోజనం చేసి పడుకున్నది. అయితే తెల్లవారు జామున చూసే సరికి ఇంట్లో కనిపించలేదు. చుట్టు పక్కల వెతికినా ఆచూకి లభ్యం కాకపోవడంతో ఆమె భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు భీమడోలు పోలీసులు తెలిపారు.



ఈ రోడ్డుపై వాహనాల పల్టీ

గణపవరం నుంచి జల్లి కొమ్మర మీదుగా తాడేపల్లిగూడెం వెళ్ళే రహదారి గుంతలమయంగా మారి ప్రజల పాలిట శాపంగా పరిణమించింది. ఈ రోడ్డులో వరదరాజపురం, వెలగపల్లి జల్లికొమ్మర వరకు గోతులు మయంగా మారి ప్రజలకు నరకం చూపిస్తోంది. పెద్దగోతుల వలన వాహనాలు బోల్తాకొట్టి పంటపొలాల్లో పడిపోతున్నాయి.

- గణపవరం



రహదారులు ఛిద్రం

కాళ్ళ మండలంలోని భీమవరం - గుడివాడ రాష్ట్రీయ రహదారి అడుగుకో గొయ్యి అన్న చందంగా మారింది. కోలనపల్లి - ఆకివీడు, వేంపాడు - కోపల్లె, సీసలి - కోమటిగుంట, జువ్వలపాలెం - ఆకివీడు, పల్లిపాలెం - మాలవానితిప్ప, కలవపూడి - మోడి రహదారులు అస్తవ్యస్తంగా తయారయ్యాయి.

- కాళ్ళ



అమ్మో బైపాస్..రోడ్డు

భీమవరం పట్టణంలో ట్రాఫిక్ రద్దీ తగ్గడానికి భారీ వాహనాలు పట్టణంలోకి రాకుండా ఉండేందుకు ఎంతో ఉపయోగపడే బైపాస్ రోడ్ పరిస్థితి దయనీయంగా మారింది. భారీ గోతులు పడటంతో వాహనాలు రోడ్డుపై పడి గాయాల పాలవుతున్నారు. రెండు రోజులు క్రితం భార్యభర్తలు ద్విచక్ర వాహనంపై వెళుతూ అదుపుతప్పడంతో కిందపడి పోయారు. ఇద్దరికి, తీవ్ర గాయాలు అయ్యాయి. బుల్లెట్ మీద వెళుతున్న ఇద్దరు యువకులు భారీ గోతిలో పడిపోవడంతో కాళ్ళకు గాయాలు అయ్యాయి. ఒక కారు గోతిలో పడటంతో మరమ్మతులకు గురైంది.

- భీమవరం క్రైం



ప్రత్తిపాడు- రాచర్ల రహదారి దుస్థితి

పెంటపాడు మండలంలోని ప్రత్తిపాడు నుంచి రాచర్ల వెళ్ళే అర్‌అండ్ బీ రహదారి వర్షాలకు ధ్వంసమైంది. 2014 సంవత్సరంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ప్పుడు ఈ రహదారిని వేశారు. తరువాత అధికారం లోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ రహదారిని పట్టించుకోలేదు. రహదారి వెంబడి పెద్ద గోతులు ఏర్పడ్డాయి. అధిక బరువుతో 10 చక్రాల లారీలు ఈ రహదారిలో ఎక్కువగా ప్రయాణాలు సాగిస్తాయి. దీంతో రహదారి మొత్తం అధ్వానంగా తయారయ్యింది. రాత్రివేళ ఈ రహదారిపై ప్రయాణం చేస్తే అంతే సంగతులు. కనీసం నడిచేందుకు కూడా వీలు లేకుండా ఉన్నది.

- పెంటపాడు



రహదారులా.. చెరువులా!

పశ్చిమగోదావరి జిల్లాలో వర్షాల కారణంగా ప్రధాన రహదారులపై ఏర్పడిన అగాథం లాంటి గోతులు యమగండాల్లా దర్శనమిస్తున్నాయి. ఈ గోతుల్లో నీరు చేరడంతో చెరువులను తలపిస్తున్నాయి. మోకాలు లోతు గోతుల వల్ల వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల అనేక మంది గాయపడ్డ సంఘటనలు చోటు చేసుకున్నాయి. కూటమి ప్రభుత్వంలోనైనా రోడ్లకు మహర్దశ పడుతుందని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు.



రోడ్లపైకి పంట చేలో నీరు

పాలమూరు శివారు నౌడూరు జంక్షన్ సమీపంలో బ్రాహ్మణ చెరువు-వీరవాసరం రహదారి అధ్వానంగా తయారైంది. వర్షం నీరు రోడ్డుపైకి చేరడంతో మురుగు వెళ్లే పంట బోదెలు ఆక్రమణకు గురికావడంతో రోడ్డుపైనే నీరు ఇంకిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది దీంతో తరచూ ఆ ప్రాంతంలో పెద్ద పెద్ద గోతులు ఏర్పడి ప్రయాణికులకు ప్రాణ సంకటంగా మారింది.

- పెనుమంట్ర



గోతుల రహదారి

గొల్లలకోడేరు గ్రామం నుంచి మహదేవపట్నం మీదుగా ఉండి వెళ్ళే పంచాయతీరాజ్ ప్రధాన రహదారి గోతులమయంగా మారింది. ఈ రహదారి నిర్మించి సుమారు నాలుగు సంవత్సరాలైంది. వర్షాలకు రహదారి పూర్తిగా పాడైపోయింది. సుమారు రెండు కిలోమీటర్లు గోతులమయంగా మారింది.

- పాలకోడేరు

బురద దారులు

అక్కుపల్లిగోకవరం-కంసాలిగుంట రహదారిలో పెద్ద గోతులు పడి వాహనదారులు అవస్థలు పడుతున్నారు. కైకరం-గుణ్ణంపల్లి రహదారి కూడా ఇదే పరిస్థితి. బాదంపూడి నుంచి తాడేపల్లిగూడెం వెళ్ళే రహదారిలో ఆర్టీసీ బస్సులు విన్యాసాలు చేస్తున్నాయి. దొంతవరం- కాగుపాడు రహదారి వర్షాకాలంలో ద్విచక్ర వాహనదారులు నరకం చూస్తున్నారు.

- ఉంగుటూరు



క్రైమ్ కార్నర్

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

తణుకు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తణుకు ఆర్టీసీ బస్టాండ్ రిజర్వేషన్ కౌంటర్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. అతని వయస్సు సుమారు 60 సంవత్సరాలు ఉంటాయని పోలీసులు తెలిపారు. ఒంటి పైన చారలు చొక్కా, కళ్ళకు అద్దాలు ఉన్నాయి. 34వ వార్డు సచివాలయం రెవెన్యూ సెక్రటరీ గంటి లక్ష్మి దానేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పంట కాల్వలో మృతదేహం

తణుకు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండపాక గ్రామంలో పంట బోదెలో వ్యక్తి మృత దేహం లభ్యమయ్యింది. మంగళవారం కాలువలో సుమారు 40 సంవత్సరాలు వయస్సు ఉంటుంది. అతని ఒంటిపై ఒక టీషర్టు, ఒక షార్ట్ ఉందని, ఒంటి మీద ఎలాంటి గుర్తులు లేవని పోలీసులు తెలిపారు. మృత దేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో ఉంచామని, వివరాలు తెలిస్తే తణుకు రూరల్ పోలీసు స్టేషన్ 94407 96641 కు తెలియజేయాలని కోరారు.

తాళాలు పగులగొట్టి బంగారం, వెండి, నగదు చోరీ

ఆకివీడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఇంటి తాళాలు పగలకొట్టి బంగారం, వెండి, నగదు చోరీ చేసినట్టు అందిన ఫిర్యాదు మేర ఎస్ఐ హనుమంతు నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. స్థానిక రైల్వే స్టేషన్ ఎదురుగా నివశిస్తున్న చేపల వ్యాపారి షేక్ అజ్మీర్ ఈ నెల 4న అమెరికా వెళ్ళారు. అజ్మీర్ వద్ద భీమవరపు ముబీన్ గుమస్తాగా పనిచేస్తూ ముస్లీం వీధిలో నివసిస్తున్నాడు. ముబీన్ రెండు రోజులకొకసారి అజ్మీర్ ఇంటికి వచ్చి తాళాలు చూసి వెళుతున్నాడు. ఈ నెల 10న రాత్రి వచ్చినప్పుడు అంతా సక్రమంగా ఉందని, 13న వచ్చి చూడగా తాళాలు పగలకొట్టి బీరువా తలుపులు తెరిచి ఉన్నాయి. అజ్మీర్‌కు ఫోన్ చేసి విషయం తెలియచేశారు. బీరువాలో మూడు కాసుల బంగారం, వెండి వస్తువులు, కొంతమేర నగదు ఉండాలని చెప్పగా పరిశీలించగా లేకపోవడంతో సోమవారం రాత్రి ముబీన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం క్లూస్ టీమ్ వచ్చి వేలి ముద్రలు సేకరించారు.

కోడి పందేలపై దాడి

కాళ్ళ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : కోడిపందేలు నిర్వహిస్తున్న స్థావరంపై దాడి చేసి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఎస్ఐ నాళం శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ప్రకారం బొండాడలో కోడిపందేలు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద రూ.1200 నగదు, కోడిపుంజు, కోడికత్తి, స్వాధీనపరుచుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పాము కాటుతో రైతుకి అస్వస్థత

పోలవరం అక్టోబరు 15 ఆంధ్రజ్యోతి : పాముకాటుతో పాడిరైతు తీవ్ర అస్వస్థతకు గురైన సంఘటన మంగళవారం పోలవరం పంచాయతీలో జరిగింది. వివరాల్లోకి వెళితే నూతనగూడెం గ్రామానికి చెందిన ఉడతా గంగాధర్ పశువుల మేత కోసం పంట చేలో గడ్డి కోస్తుండగా పాము కాటు వేయగా తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన స్థానికులు అతనిని పోలవరం ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యాధికారి కృష్ణంరాజు అతనికి ప్రథమ చికిత్స అందించారు. ప్రస్తుతం అతని పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు.

నేటి నుంచే లాసెట్ వెబ్ కౌన్సెలింగ్

16 నుంచి రిజిస్ట్రేషన్‌లు

22 నుంచి కళాశాలల ఎంపిక

28న సీట్ల కేటాయింపు

భీమవరం ఎడ్యుకేషన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): న్యాయ కళాశాలల్లో 2024-25 న్యాయశాస్త్ర కోర్సుల్లో చేరేందుకు నిర్వహించే లాసెట్ 2024 కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ బుధవారం నుంచి మొదలుకానుంది. ఈనెల 16వ తేదీ నుంచి 20 వరకు వెబ్ కౌన్సెలింగ్‌లో లాసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు రిజిస్ట్రేషన్ నమోదు కావాలి. 22వ తేదీ నుంచి 25 వరకు వెబ్ ఆప్షన్స్ ద్వారా వారికి నచ్చిన కళాశాలను ఎంచుకోవాల్సి ఉంది. 26వ తేదీన కళాశాలల ఎంపికలో ఏమైనా మార్పులు చేసుకోవాలనుకునే విద్యార్థులు కళాశాలను ఎంపిక మార్చుకునే అవకాశం ఉంటుంది. 28వ తేదీన ఎవరికి ఏ కళాశాల వచ్చిందన్న వివరాలతో సీట్లు కేటాయింపు జరుగుతుంది. 29, 30 తేదీలలో సీట్లు కేటాయించిన లా కళాశాలలో విద్యార్థులు చేరాల్సి ఉంటుంది.

వెబ్ కౌన్సెలింగ్‌కి కావాల్సినవి

లాసెట్ వెబ్ కౌన్సిలింగ్ చేసుకునే విద్యార్థులు లాసెట్ హాల్ టికెట్, ర్యాంక్ కార్డు ఆన్‌లైన్‌లో పొందుపరచాలి. వాటితో పాటు టెన్త్, ఇంటర్, డిగ్రీ ప్రొవిజనల్, మార్కుల మెమోస్ పెట్టాలి. టీసీ, ఆధార్ కార్డు, 6వ తరగతి నుంచి టెన్త్ వరకు స్టడీ సర్టిఫికెట్‌ను జతచేయాలి. బి.బి.ఎ. ఎల్.ఎల్.బి, బి.బి.పి. కోర్సుకు ఇంటర్, టెన్త్ మార్క్స్ లిస్టులతో పాటు 6వ తరగతి నుంచి 10 వరకు స్టడీ సర్టిఫికెట్స్, ఆధార్ కార్డు, పదవ తరగతి టీసీ ఆన్‌లైన్‌లో సమర్పించాలి. అదే ఎల్.ఎల్.బి, ఎల్.ఎల్.ఎం. కోర్సుకైతే టెన్త్, ఇంటర్, డిగ్రీ ప్రొవిజనల్, మార్క్స్ మెమో, టెన్త్ టీసీ, 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్స్, ఆధార్‌కార్డు ఆన్‌లైన్‌లో సమర్పించాలి. కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్ ఫీజు కింద ఎస్సీ, ఎస్టీలకు 500 రూపాయలు, ఓసీ, బీసీలకు 1000 రూపాయలు చెల్లించాలి.

ఏలూరు నగరంలో దొంగల జోరు

పోలీసు నిఘా వైఫల్యం

ఏలూరు క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రమైన ఏలూరు నగరంలోనే పోలీసులకు దొంగలు సవాళ్ళు విసిరినట్లు నేరాలకు పాల్పడుతున్నారు. కొద్ది రోజులుగా నగరంలో పరిశీలన జరిపితే నేరస్తులు రెచ్చిపోతున్నారు. తెల్లవారేటప్పటికి ఏదో ఒక ఇంట్లో కన్నం వేస్తున్నారు. నగరంలో శాంతిభద్రతలు కాపాడడానికి మూడు లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్లు, నేరస్తులను పసిగట్టడానికి ఒక సీసీఎస్ పోలీస్ స్టేషన్ ఉన్నాయి. అయినప్పటికీ ఇటీవల దొంగలు తమ చేతి వాటాన్ని ప్రదర్శిస్తూనే ఉన్నారు. ఏలూరు టూటౌన్, త్రి టౌన్, రూరల్ ప్రాంతాల్లో ఈ నేరాలకు ఎక్కువగా పాల్పడుతున్నారు. త్రి టౌన్ పరిధిలో మాత్రం ఒకే ఒక్కడు అన్నట్లుగా ఒక దొంగ మాస్క్ ధరించి నేరాలకు పాల్పడుతున్నట్లుగా పోలీసులు గుర్తించినట్లుగా తెలుస్తోంది. ఇప్పటికే పాత నేరస్తులు ఎక్కడ ఉన్నారు? ఏమి చేస్తున్నారు అనే కోణంలో కూడా దర్యాప్తు చేయాల్సి ఉంది. ఇటీవల పోలీసులకు బందోబస్తులు ఎక్కువ కావడంతో నగరంలో పోలీసింగ్ గస్తీ తగ్గిందనే తెలుస్తోంది. దీంతో ఇదే అదనుగా తీసుకున్న దొంగలు దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఇంటికి తాళం వేసి ఉందంటే క్షణాల్లో ఆ ఇంటిని దోచేస్తున్నారు. క్లూస్ టీమ్‌లు, పోలీసు జాగిలాలు రంగంలోకి దిగుతున్నప్పటికీ ఫలితాలు రావడం లేదని తెలుస్తుంది. కొత్త నేరస్తుల, పాత నేరస్తులా అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారని తెలుస్తోంది. సీసీ కెమెరాల్లో మాత్రం ఒక మాస్క్ ధరించిన నేరస్తుడే నేరాలకు పాల్పడుతున్నట్లుగాపోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. నగరంలో నిఘా పెంచాలని ప్రజలు కోరుతున్నారు. జిల్లా కేంద్రంలోని వందలాది మంది పోలీసులు ఉండే ప్రాంతంలోనే నేరాలు జరుగుతున్నాయంటే మిగిలిన ప్రాంతాల పరిస్థితి ఏమిటనే ప్రశ్న తలెత్తుతోంది.

చొదిమెళ్ళలో చోరీ

ఏలూరు క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఇంటికి తాళం వేసి ఊరువెళ్ళి వచ్చేటప్పటికి దొంగలు ఆ ఇంటి తాళాలు పగులగొట్టి వెండి, బంగారు ఆభరణాలు, నగదు అపహరించుకుపోయారు. ఏలూరు చొదిమెళ్ళలో కొండేటి సతీష్‌కుమార్ తన కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. ఆయన డీఐజీ కార్యాలయంలో ఉద్యోగం చేస్తున్నారు. విశాఖపట్నంలోని బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి తన కుటుంబ సభ్యులతో సహా వెళ్ళారు. తిరిగి మంగళవారం ఉదయం వచ్చేటప్పటికీ ఇంటితాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లోని కేజీ వెండి వస్తువులు, కొంత బంగారం, కొంత నగదు అపహరణకు గురయ్యాయి. దీంతో ఈ సంఘటనపై ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మహనీయుడు అబ్దుల్ కలాం

ఏలూరు టూ టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : దేశం అభివృద్ధి కోసం జీవితాంతం మహనీయుడు మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం అని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ అన్నారు. ఎంపీ క్యాంపు కార్యాలయంలో అబ్దుల్‌కలాం జయంతి వేడుకలు మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సామాన్య కుటుంబంలో జన్మించి అత్యున్నతమైన రాష్ట్రపతి పదవి అలంకరించిన మహోన్నతమైన వ్యక్తి కలాం నేటి యువతకు ఆదర్శమని ఎంపీ అన్నారు. కార్యక్రమంలో కాట్రు బాలకృష్ణ, వీప్రతాప్, మల్లిపూడి రాజు, తదితరులు పాల్గొన్నారు.

గడువు పొడిగింపు

ఏలూరు అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని కుక్కునూరు, వేలేరు, వేలేరుపాడు కేజీబీవీల్లో బోధనేతర సిబ్బంది నియామకాలకు అర్హులైన అభ్యర్థులు సంబంధిత ఎంఈవో కార్యాలయాల్లో దరఖాస్తులు అందజేసేందుకు గడువును ఈ నెల 17వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు పొడిగించినట్టు డీఈవో అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టులను మహిళా అభ్యర్థులు, దివ్యాంగ మహిళా అభ్యర్థులకు మాత్రమే ప్రత్యేకించినట్టు తెలిపారు.

నేడు పల్లె పండుగ

లింగపాలెం, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం జరిగే పల్లె పండుగ కార్యక్రమానికి ఎమ్మెల్యే సొంగారోషన్ కుమార్ హాజరవుతారని మండల టీడీపీ అధ్యక్షుడు గరిమళ్ళ చలపతిరావు తెలిపారు. ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటరన్నారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారని తెలిపారు.

● పెదపాడు : పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఉదయం 10 గంటలకు పెదపాడు గ్రామం తెలగాలపేట, తోటగూడెం, వసంతవాడ గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేస్తారని ఎంపీడీవో ఒక ప్రకటనలో తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి రత్నప్రసాద్

ఏలూరు క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : వసతి గృహ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్ అన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి పురుషోత్తమ కుమార్ ఆదేశాల మేరకు ఏలూరులోని శిశు గృహం, సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాలను మంగళవారం జడ్జి రత్న ప్రసాద్ తనిఖీ చేశారు. విద్యార్థినుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. న్యాయ సహాయం కావాల్సిన వారికి ఉచితంగా అందిస్తామన్నారు. న్యాయవాది కోనే సునీత, డీసీపీవో సూర్య చక్రవేణి, వసతి గృహ వార్డెన్లు వెంకటేశ్వరమ్మ, రాధాదేవి, ఎస్ సర్వమంగళ పాల్గొన్నారు.

కాలక్షేపం చేస్తున్నారని..

ఉంగుటూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : వెల్ఫేర్ అసిస్టెంట్లు, సిబ్బంది విధి నిర్వహణలో ఫోన్లో గేమ్స్ ఆడుకుంటూ కాలక్షేపం చేస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని, అటువంటివి మానుకోవాలని ఎంపీడీవో రాజ్‌మనోజ్ హెచ్చరించారు. మండల పరిషత్తు కార్యాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని సూచించారు.

నిర్వీర్యమవుతున్న స.హ చట్టం

ఏలూరు రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : సమాచార హక్కు చట్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేశాయని టీమ్‌ఫర్ గుడ్ గవర్నెన్స్ సమాచార హక్కు చట్టం జాతీయ అధ్యక్షుడు కమ్మ శివరామకృష్ణ విమర్శించారు. స్థానికంగా మంగళవారం స.హ చట్టంపై చర్చావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2005లో అమల్లోకి వచ్చిన సహ చట్టం సామాన్యులకు ఓ అస్త్ర మన్నారు. సమాచార రాష్ట్ర అధ్యక్షుడు దుర్గాప్రసాద్, తెలంగాణ అధ్యక్షుడు చందర్, జాతీయ కార్యదర్శి బీవీఆర్ చౌదరి, వీఎస్‌వీ సత్యనారాయణ, లీగల్ అధ్యక్షులు బీకేఎస్ ఐయ్యంగర్ తదితరులు పాల్గొన్నారు.

18న ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సదస్సు

ఏలూరు రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో ఈ నెల 18న జరిగే ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం ఏలూరు మార్కెట్ యార్డు హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఐఎఫ్‌టీయూ నగర ప్రధాన కార్య దర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ రూ.4 కోట్ల కు పైబడి ఉన్న హమాలీ కార్మికులకు ఈఎస్ ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. టి.అప్పారావు, విజయ్, రమణ, అప్పలరాజు, అక్కమ్మ, దుర్గమ్మ, సత్యవతి, రమణ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను చదివిద్దాం

కామవరపుకోట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : విద్యాశాఖ ఆధ్వర్యంలో మండల విద్యాశాఖాధికారి డి.సుబ్బారావు మంగళవారం కామవరపుకోటలో అభ్యాసన సమస్యలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పిల్లలను చదివిద్దాం-జీవితాల్లో వెలుగులు నింపుదామని చెప్పారు. దివ్యాంగుల పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పరీక్షల్లోను, ఉద్యోగాల్లోను ప్రభుత్వం వారికి రాయితీ కల్పించిందన్నారు. ఎంఈఓ-2 ప్రశాంతకుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలి

టి.నరసాపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక విజన్ యూపీ స్కూల్లో మంగళవారం మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలు ప్రపంచ విద్యార్థుల దినోత్సవ వేడుకలు పాఠశాల హెచ్‌ఎం పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులపై ఆయనకున్న ప్రేమకు చిహ్నంగా ఆయన పుట్టిన రోజు ను ప్రపంచ విద్యార్థుల దినోత్సవంగా జరుపుకుంటున్నామని అన్నారు. మే నెల 26న స్విట్జర్లాండ్‌లో ఆయన పర్యటించిన సందర్భానికి గుర్తుగా ఆ దేశ ప్రజలు ఆ రోజును ఆ దేశపు జాతీయ సైన్స్ దినోత్సవంగా జరుపుకుంటున్నారని పేర్కొన్నారు. పాఠశాల విద్యార్థులకు మహనీయుడు అబ్దుల్ కలాం అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు.

● ఉంగుటూరు : ఉప్పాకపాడు ఫౌండేషన్ పాఠశాలలో అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా పాఠశాలలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్‌ఎం ఎస్.సుధాకర్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

● కామవరపుకోట : రావికంపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద, స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద అబ్దుల్‌కలాం జయంతి నిర్వహించారు. అధ్యాపకులు బి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ మల్లేశ్వరరావు అబ్దుల్‌కలాం చిత్రపటా నికి పూలమాలలు వేసి నివాళులర్పించారు

● భీమడోలు : భీమడోలు సర్కిల్ ఫోటో గ్రాఫర్ల యూనియన్ ఆధ్వర్యంలో అబ్దుల్ కలామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. అబ్దుల్ కలామ్‌తో పాటు డాకురే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఏలూరు విజన్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జి. రంగారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. భీమడోలు మాధురి జూనియర్ కళాశాలలో కలామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. భీమడోలు ఎస్ఐ సుధాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని అబ్దుల్ కలామ్ సేవల ను కొనియాడారు. కళాశాల ప్రిన్సిపాల్ కేసరి, కో ఆర్డినేటర్ బాలు పాల్గొన్నారు.



టి.నరసాపురంలో అబ్దుల్ కలాంకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు

పల్లె పండుగతో గ్రామాల అభివృద్ధి

ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

పెదవేగి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదవేగిలో రూ.25.50 లక్షలతో నిర్మించనున్న రెండు సీసీ రోడ్ల నిర్మాణాలకు, కొప్పులవారిగూడెంలో నిర్మించనున్న సీసీ రోడ్లకు ఎమ్మెల్యే చింతమనేని మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి అధికారంలోకి రావడంతోనే గ్రామీణ రహదారులకు మహర్దశ వచ్చిందన్నారు. సంక్రాంతి నాటికి నియోజకవర్గంలో రహదారులను అభివృద్ధి చేస్తామని ఆయన చెప్పారు. రైతుల సంక్షేమానికి అనుగుణంగా మినీ గోకులాల నిర్మాణాలను చేపడుతున్నామని, ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆర్.చిరంజీవి, పెదవేగి, లక్ష్మీపురం సర్పంచ్‌లు తాతా శ్రీరామ్మూర్తి, మేకా కనకరాజు, జనసేన నాయకులు ఘంటసాల వెంకటలక్ష్మి, కొఠారు ఆదిశేషు, టీడీపీ నాయకులు బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, మాగంటి నారాయణప్రసాద్, తాతా యశ్వంత్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతమనేని

ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం

ఎమ్మెల్యే బాలరాజు

కొయ్యలగూడెం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రతీ గ్రామం ఆదర్శ గ్రామంగా తీర్చి దిద్దుతామని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. రామానుజపురం, సీతంపేట, సరిపల్లి, కొయ్యలగూడెం, గవరవరం గ్రామాల్లో సీసీ రోడ్లకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతీ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. నియోజక వర్గంలోని అన్ని గ్రామాలకు సీసీరోడ్లు మంజూరయ్యాయని తెలిపారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ప్రతీ గ్రామంలోనూ పండుగ వాతావరణంలో కార్యక్ర మం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల జనసేన అధ్యక్షుడు తోట రవి, మండల టీడీపీ అధ్యక్షుడు పారేపల్లి నరేష్, కూటమి నాయకులు దుగ్గిన శ్రీను, ఎస్ఆర్ఆర్ నరసింహ రాజు, కసుకుర్తి ఉమా, మాదేపల్లి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



రామానుజపురంలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

మహిళా పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన ఎస్పీ

ఏలూరు క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మహిళల రక్షణ కోసం ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ కేపీఎస్ కిషోర్ ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎస్పీ ఏలూరు కోటదిబ్బపై ఉన్న మహిళా పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని సీసీ కెమెరాల పనితీరు, వాటి బేకప్, కంప్యూటర్లలో కేసుల వివరాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గుడ్‌టచ్, బ్యాడ్ టచ్ అనే అంశంపై పాఠశాల, కాలేజీ విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. స్టేషన్ సీఐ ఎం.సుబ్బారావు, ఎస్ఐ కాంతిప్రియలనుంచి కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.



కంప్యూటర్‌లో కేసుల వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ

బాలికల రక్షణ మహిళా పోలీసులు

బాలికల రక్షణ కోసం ప్రత్యేకంగా మహిళా పోలీసులు విద్యాసంస్థల వద్ద గస్తీ నిర్వహిస్తున్నారని ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం.సుబ్బారావు తెలిపారు. రామకోటి వద్ద ఉన్న గవర్నమెంట్ గర్ల్స్ హైస్కూలులో గుడ్ టచ్, బ్యాడ్‌టచ్, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని మహిళా పోలీస్ స్టేషన్ ఆధ్వర్య ంలో నిర్వహించారు. సీఐ ఎం సుబ్బారావు, ఎస్ఐ కాంతిప్రియ మాట్లాడుతూ విద్యాలయాల వద్ద ఆకతాయిలు వేధింపులకు గురి చేస్తే వెంటనే 112కు డయల్ చేస్తే పది నిముషాలలోనే పోలీసులు రక్షణ కల్పిస్తారన్నారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురయితే వెంటనే 1930కు సమాచారం అందించాలని సూచించారు.

శ్మశానవాటికకు స్థలం కేటాయించండి

ఏలూరు రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు శ్మశానవాటికలో స్థలం లేనందున కొత్త సమాధులకు స్థలం కేటాయించాలని కోరుతూ ఏలూరు సిటీ పాస్టర్స్ అసెంబ్లీ అధ్యక్షుడు రెవరెండ్ కె.సుదర్శన్‌బాబు విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్‌ను మంగళవారం కలిసి ఈ మేరకు వినతిపత్రం అందచేశారు. ప్రస్తుతం ఉన్న శ్మశాన వాటికలో స్థలం సరిపోని కారణంగా కొత్తగా సమాధులకు స్థలం ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. అంతకు ముందు ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, జనసేన ఇన్‌చార్జి రెడ్డిఅప్పలనాయుడును కలిసి నూతన సమాధుల తోట స్థలసేకరణ, కమ్యూనిటీహాల్ కోసం నిధులు మంజూరు చేసేలా విజ్ఞప్తి చేసినట్టు సుదర్శన్‌బాబు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో రత్నప్రసాద్, జె.యెహోషువ, ఎం.ప్రణీత్‌బాబు, ఎన్.ఎల్ పాల్, జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందచేస్తున్న నాయకులు

ప్రయాణికులు జాగ్రత్తగా ఉండాలి

ఏలూరు క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : దొంగతనాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు అధికారులు ప్రయాణికులకు సూచించారు. వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ వారి సిబ్బంది మంగళవారం రాత్రి ఏలూరు పాతబస్టాండ్ ప్రాంతంలో గస్తీ నిర్వహించారు. ప్రయాణీకులకు పలు సూచనలు చేశారు. ప్రజలందరూ దసరా సెలవులు ముగియడంతో తిరుగు ప్రయాణంలో దొంగతనాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాతబస్టాండ్‌లో లైటింగ్, సీసీ కెమెరాలు పనితీరును పరిశీలించారు. ఆర్టీసీ అధికారులకు పలు సూచనలు చేశారు.



ఏలూరు పాతబస్టాండ్ వద్ద తనిఖీ చేస్తున్న వన్ టౌన్ సీఐ సత్యనారాయణ

ఓటర్ల నమోదులో చిత్తశుద్ధితో పనిచేయాలి

పెదవేగి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : త్వరలో జరుగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల నమోదు విషయంలో నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండి, పనిచేయాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. లక్ష్మీపురంలోని దెందులూరు మార్కెట్ యార్డులో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదు అవగాహన కార్యక్రమం ప్రభాకర్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రాడ్యుయేట్‌లు అందరినీ ఓటర్లుగా నమోదు చేయాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు కార్యకర్తల కృషిపై ఆధారపడి ఉందన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి ఓటర్ల నమోదులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు చేశారు. టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి పి.రాజశేఖర్, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డిస్‌లెక్సియాపై అవగాహన

పెదపాడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులు మంగళవారం డిస్‌లెక్సియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎం పి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ డిస్‌లెక్సియా అనగా విద్యార్థుల్లో చదవడం, రాయడం వంటి అంశాల్లో తలెత్తే అంశాలకు సంబంధించిందన్నారు. దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇది నేర్చుకొనుటలో ఎదురయ్యే ప్రత్యేకమైన లోపంగా మాత్రమే పరిగణించాలని, తెలివి తక్కువతనం, ప్రయత్న లోపం మాత్రం కాదని తెలిపారు. ఇటువంటి పిల్లలు సగటు మేధస్సు కంటే అధిక మేధస్సును కలిగి ఉంటారని తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలపొంగళ్లు నైవేద్యం

పోలవరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఎల్లండీపేట గ్రామ దేవత పాపమ్మతల్లికి మంగళవారం గ్రామస్థులు పాలపొంగళ్లు నైవేద్యం సమర్పించి పూజలు చేశారు. దానవాయి కొండపై ఉన్న పాపమ్మ తల్లిని భక్తులు భారీ సంఖ్యలో దర్శించుకున్నారు. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు.

2 నుంచి కార్తీక మాసోత్సవాలు

ఏలూరు కార్పొరేషన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శివనగర్‌లోని భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయం వద్ద నవంబర్ 2వ తేదీ నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు కార్తీక మాసోత్సవాలను నిర్వహిస్తున్నట్టు ఆలయ అర్చకులు వెంకటరత్నం శర్మ తెలిపారు.

అన్న సమారాధనలు

ఏలూరు కార్పొరేషన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : పత్తేబాదలోని కనకదుర్గమ్మ ఆలయం వద్ద, సత్రంపాడులోని సౌభాగ్యలక్ష్మీదేవి ఆలయం వద్ద శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్స వాలు ముగిసిన నేపథ్యంలో ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్న సమారాధనలు నిర్వహిచారు.

● పెదపాడు : అప్పనవీడు అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద తమ్మ భాస్కరరావు, వెంకటలక్ష్మి కుటుంబ సభ్యుల సహకారంతో మంగళవారం నిర్వహించిన అన్న సమారాధనలో సుమారు 200 భక్తులు పాల్గొన్నారని ఈవో కె.శ్రీనివాస్ తెలిపారు.

● పోలవరం : స్థానిక మహాత్మాగాంధీ స్మారక వృద్ధాశ్రమంలో మంగళవారం మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎం.సీత మనవరాలు తేజస్విని ప్రియ జన్మదినం సందర్భంగా కుటుంబ సభ్యులు వృద్ధులకు అన్నదానం చేశారు. వృద్ధులకు పాలు పండ్లు పంపిణీ చేశారు.

సీజనల్ వ్యాధులతో జర భద్రం

ఉంగుటూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధులపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని తాడేపల్లిగూడెం మలేరియా యూనిట్ ఉప ఆరోగ్య అధికారి వైవీ లక్ష్మణరావు అన్నారు. కాగుపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య, అంగన్‌వాడీ సిబంది పాల్గొన్నారు.

● లింగపాలెం : ప్రజలంతా ఆరోగ్య నియమాలు పాటించాలని కిషోర్ అన్నారు. కె.గోకవరంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించి ప్రజలకు పలు సూచనలు చేశారు.

తూడు తొలగింపు



ద్వారకాతిరుమల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తూడు, చెత్తచెదారంతో పూడుకుపోయిన శ్రీవారి సుదర్శన పుష్కరిణిని బాగు చేసేందుకు ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు. రానున్న తెప్పోత్సవాన్ని పురస్కరించుకుని పుష్కరిణిని సుందరంగా తీర్చిదిద్దేందుకు దేవాలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పుష్కరిణిలో ఏడాదిగా పేరుకున్న చెత్త, తూడును తొలగింపు చేపట్టారు. మరో నాలు గైదు రోజులు ఈ పనులు ఉంటాయని అధికా రులు చెబుతున్నారు.

మద్ది క్షేత్రంలో ప్రత్యేక పూజలు

జంగారెడ్డిగూడెం,సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గుర్వాయిగూడెంలోని మద్ది ఆంజనేయ స్వామికి తమలపాకులతో విశేష పూజలు జరిగాయి. స్వామి ఆలయానికి వివిధ సేవల రూపంలో రూ. లక్షా 34 వేల 981 ఆదాయం సమకూరినట్లు ఈవో ఆర్‌వీ చందన తెలిపారు.

టెట్‌కు 324 మంది హాజరు

ఏలూరు అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్షల్లో (టెట్)లో మంగళవారం 324 మంది హాజరయ్యారు. ఉదయం జరిగిన పరీక్షకు 186 మంది అభ్యర్థులకు 158 మంది, మధ్యాహ్నం 186 మందికి 166 మంది హాజరైనట్లు డీఈవో అబ్రహం తెలిపారు. పరీక్ష ప్రశాంతంగా జరిగిందన్నారు.

పురుగు మందులతో అనర్థం

రైతులకు వ్యవసాయాధికారుల సూచనలు

బుట్టాయగూడెం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయంలో రసాయనిక ఎరువులు, పురుగు మందుల వినియోగం తగ్గించాలని ఏవో డి.ముత్యాలరావు సూచించారు. కేఆర్ పురం, అచ్చియ్యపాలెంలో గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. అధికారుల సూచనలు మేరకు మాత్రమే ఎరువులు, పురుగు మందులు వాడాలన్నారు. ప్రకృతి వ్యవసాయం వలన ఖర్చులు తగ్గడమే కాకుండా నాణ్యమైన అధిక దిగుబడులు పొందవచ్చని తెలిపారు.

రైతుల సమక్షంలో అగ్ని అస్త్రం కషాయం తయారు చేసి రైతులకు ఇచ్చి కూరగాయల సాగులో వాడాలన్నారు. అంతకముందు వరి పంట పొలాలను రైతులతో కలిసి ఏవో పరిశీలించారు. వరి పంటలో ఆకు ముడత, అగ్గి తెగులు ఉన్నట్లు గుర్తిం చారు. తెగుళ్ల వలన దిగుబడులు తగ్గే అవకాశం ఉందని సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని రైతుల కు సూచించారు. వ్యవసాయ, పశుసంవర్ధక సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం : రైతులు ప్రభుత్వ పథకాలను వినియోగించుకుని లబ్ధి పొందాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు అన్నారు. మండలంలోని శ్రీనివాసపురంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం ఏవో కేఎస్‌వీ పోశారావు ఆధ్వర్యంలో జరిగింది. సర్పంచ్ యడ్లపల్లి రాధిక, ఎంపీటీసీ జె.తాతా రావు, టీడీపీ నాయకులు పోల్నాటి సత్యనారాయ ణ, ఎలికే తాతారావు, తడికల దావీదు, వెంకటేశ్వ రరావు, శ్రీను, ఉదయ్ కుమార్, వ్యవసాయ శాఖ సిబ్బంది షాలిని తదితరులు పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి : రైతులు ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో పంటలు పాడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంఏవో కె.గంగాధరం అన్నారు. అంకన్నగూడెం, రాచన్నగూడెం రైతు సేవా కేంద్రాల సమీప పొలాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. రైతులు అధిక దిగుబడుల సాధన కోసం ఎంఏవో సూచనలిచ్చారు. పత్తి, వరి, వేరు శనగ పంటల్ని పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ప్రశాంత్‌కుమార్ ఉన్నారు.

● భీమడోలు : గుండుగొలనులోని వ్యవసాయ క్షేత్రాలను జిల్లా వ్యవసాయ శాఖాధికారి అబీబ్ బాషా పరిశీలించారు. అనంతనం రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉన్న మిల్లులను ఎంపిక చేసుకునే విధానాన్ని తీసుకువచ్చామన్నారు. దిగుబడితో పాటు నాణ్యమైన దిగుబడి ప్రకృతి వ్యవసాయం ద్వారా సాధించవచ్చునని రైతులకు సూచించారు. పశువుల దాణా, మినీ గోకులం పథకాలపై వెటర్నీ వైద్యులు వివరించారు. భీమడోలు ఏడీఏ ఉషారాజకుమారి, మండల వ్యవసాయ శాఖ అధికారులు ఉషారాణి, పశుసంవర్ధక వైద్యులు హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అంకన్నగూడెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న ఎంఏవో గంగాధరం, రైతులు

రూ. 22 కోట్లతో అభివృద్ధి పనులు

కామవరపుకోట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో రూ.22 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేసినట్టు చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ పేర్కొన్నారు. ఉప్పలపాడులో సీసీ రోడ్లకు శంకు స్థాపన చేసిన సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ వైసీపీ పాలనలో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయని, దీంతో సీఎం, డిప్యూటీ సీఎంలు ప్రత్యేక శ్రద్ధ వహించి రోడ్ల నిర్మాణాలకు ప్రాధాన్యత ఇచ్చారని చెప్పారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, తెలుగు రైతు ఏలూరు పార్లమెంట్ ఉపాధ్యక్షులు మద్దిపోటి నాగేశ్వర రాంబాబు, మాజీ జడ్పీటీసీ ఘంటా సుధీర్‌బాబు, రావికంపాడు సర్పంచ్ వేముల నాగేశ్వరరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ కోనేరు వెంకట సుబ్బారావు ఉన్నారు.

మందు బాబుల కోసం డ్రాపింగ్ వ్యాన్స్ ఏర్పాటు చేయాలి

ఏలూరు రూరల్, అక్టోబరు 15: మద్యం దుకాణాల వద్ద, బారులు వద్ద మద్యం సేవించే వారికోసం ఉచిత డ్రాపింగ్ వ్యాన్స్ ఏర్పాటు చేయాలని బీజేపీ, కిసాన్ మోర్చా ఏలూరు జిల్లా అధ్యక్షుడు కీర్తిరామ్ ప్రసాద్, కలెక్టర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. మద్యపాన ప్రియులకు వారి కుటుంబాలకు భరోసా ఉండాలనే ఉద్దేశంతో మద్యపానం చేసిన వ్యక్తి మద్యం మత్తులో ఇంటికి వెళ్లలేక చాలా సందర్భాల్లో ఇబ్బందులు పడటమే కాకుండా రోడ్డు ప్రమాదాల బారినపడి ప్రాణాలు పోతున్నాయని అన్నారు. ప్రభుత్వానికి వచ్చే ఆదాయం కన్నా వారి ప్రాణాలు కూడా ముఖ్యమని డ్రాపింగ్ వ్యాన్స్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. నడపన దానభాస్కర్‌రావు,ఎం.కృష్ణదేవరాయలు, మోపిదేవి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వీధి కుక్కల నివారణకు చర్యలు

జంగారెడ్డిగూడెం,సెప్టెంబరు 15 : ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పట్టణంలోని వీధి కుక్కల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు జంగారెడ్డిగూడెం మున్సిపల్ కమిషనర్ కె.వెంకటరమణ మంగళవారం తెలిపారు. వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు వేయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

కుక్కునూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రవాణా రంగ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు కోరారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల లారీ, ట్రక్కు, వ్యాన్ డ్రైవర్లు సీఐటీయూ కార్మిక సంఘంలో మంగళవారం చేరారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రవాణా రంగం నుంచి ప్రత్యక్షంగా, పరోక్షంగా వేల కోట్ల రూపాయల ఆదాయాన్ని ప్రభుత్వాలు సమకూర్చుతున్నప్పటికి కార్మికుల సంక్షేమం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కుక్కునూరు, వేలేరుపాడు మండాలాల లారీలకు ఇసుక రవాణా చేసేందుకు అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు వై.సాయికిరణ్, కె.నాగలక్ష్మి, దుర్గారావు, నాగేంద్రరావు, నిర్మల వెంకటేశ్వర్లు, కె.మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా నౌబుత్‌ఖానా



ద్వారకాతిరుమల, అక్టోబరు 15 (ఆంధ్ర జ్యోతి): చిన్నతిరుమలేశుని కల్యాణమహోత్స వాల్లో ఓ ముస్లిం బృందం నిర్వహించిన నౌబు త్‌ఖానా కచేరి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆలయంలో అన్నమయ్య విగ్రహం వద్ద ఈ బృంద సభ్యులు నిర్వహించిన వాయిద్యం శ్రోతలకు వీనులవిందైంది. కుతుబ్‌షాహి, నిజాం యుగాలు చాలా కాలం క్రితం ముగిశా యి. అయితే వారి అనేక రాచరిక సంప్రదాయాలు, పద్ధతులు నేటికీ వాడుకలో ఉన్నాయి. వాటిలో ఈ నౌబుత్ ఖానాను తొమ్మిది రకాల వాయిద్యాల సమిష్టిగా చెప్పొచ్చు. ఏలూరుకు చెందిన మహమ్మద్ వలి ఆధ్వర్యంలో జరిగిన ఈ నౌబుత్ ఖానా పార్టీ అలరించింది.

మ్యారేజ్ మీడియేటర్స్ అనండి

ఏలూరు రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : వధువు, వరులకు వివాహాలు కుదిరితే మ్యారేజ్ బ్యూరోలను, మ్యారేజ్ బ్రోకర్స్ అని పిలువకుండా ప్రభుత్వం జీవో తీసుకురావాలని ఆల్ ఆంధ్రా మధ్యవర్తుల వివాహ సంఘం అధ్యక్షుడు దేవరశెట్టి రంగారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జాబిల్లి ఫంక్షన్ హాల్లో మంగళవారం సంఘ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ డబ్బుల కోసం నకిలీ పెళ్లిళ్లు చేస్తున్న కొందరు మ్యారేజ్ మీడియేటర్స్ కారణంగా సక్రమంగా వివాహాలు జరిపిస్తున్న మ్యారేజ్ మీడియేటర్స్‌పై ప్రభావం చూపిస్తుందన్నారు. మ్యారేజ్ మీడియేటర్లను వివాహ మధ్యవర్తులుగా పిలవాలన్నారు. ప్రతి జిల్లాలో సమావేశాలు జరుపుకునేందుకు స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. సంఘ నాయకులు రామానాయుడు, తారక రామారావు, 23 జిల్లాల నుంచి నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు

కామవరపుకోట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కేజీఆర్ మెడికల్ స్టోర్స్ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ఉచిత బీపీ, మధుమేహం వ్యాధి పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య పరిరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రాణి, సాయి సందీశ్వర్ వివరించారు.

నేటి నుంచే లాసెట్ వెబ్ కౌన్సెలింగ్

16 నుంచి రిజిస్ట్రేషన్‌లు
22 నుంచి కళాశాలల ఎంపిక
28న సీట్ల కేటాయింపు

భీమవరం ఎడ్యుకేషన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): న్యాయ కళాశాలల్లో 2024-25 న్యాయశాస్త్ర కోర్సుల్లో చేరేందుకు నిర్వహించే లాసెట్ 2024 కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ బుధవారం నుంచి మొదలుకానుంది. ఈనెల 16వ తేదీ నుంచి 20 వరకు వెబ్ కౌన్సెలింగ్‌లో లాసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు రిజిస్ట్రేషన్ నమోదు కావాలి. 22వ తేదీ నుంచి 25 వరకు వెబ్ ఆప్షన్స్ ద్వారా వారికి నచ్చిన కళాశాలను ఎంచుకోవాల్సి ఉంది. 26వ తేదీన కళాశాలల ఎంపికలో ఏమైనా మార్పులు చేసుకోవాలనుకునే విద్యార్థులు కళాశాలను ఎంపిక మార్చుకునే అవకాశం ఉంటుంది. 28వ తేదీన ఎవరికి ఏ కళాశాల వచ్చిందన్న వివరాలతో సీట్లు కేటాయింపు జరుగుతుంది. 29, 30 తేదీలలో సీట్లు కేటాయించిన లా కళాశాలలో విద్యార్థులు చేరాల్సి ఉంటుంది.

వెబ్ కౌన్సెలింగ్‌కి కావాల్సినవి

లాసెట్ వెబ్ కౌన్సిలింగ్ చేసుకునే విద్యార్థులు లాసెట్ హాల్ టికెట్, ర్యాంక్ కార్డు ఆన్‌లైన్‌లో పొందుపరచాలి. వాటితో పాటు టెన్త్, ఇంటర్, డిగ్రీ ప్రొవిజనల్, మార్కుల మెమోస్ పెట్టాలి. టీసీ, ఆధార్‌కార్డు, 6వ తరగతి నుంచి టెన్త్ వరకు స్టడీ సర్టిఫికెట్‌ను జతచేయాలి. బి.బి.ఏ. ఎల్.ఎల్.బి, బి.బి.ఏ. కోర్సుకు ఇంటర్, టెన్త్ మార్క్స్ లిస్టులతో పాటు 6వ తరగతి నుంచి 10 వరకు స్టడీ సర్టిఫికెట్స్ ఆధార్‌కార్డు, పదవ తరగతి టీసీ ఆన్‌లైన్‌లో సమర్పించాలి. అదే ఎల్.ఎల్.బి, ఎల్.ఎల్. ఎం. కోర్సుకైతే టెన్త్, ఇంటర్, డిగ్రీ ప్రొవిజనల్, మార్క్స్ మెమో, టెన్త్ టీసీ, 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్స్, ఆధార్‌కార్డు ఆన్‌లైన్‌లో సమర్పించాలి. కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్ ఫీజు కింద ఎస్సీ, ఎస్టీలకు 500 రూపాయలు, ఓసీ, బీసీలకు 1000 రూపాయలు చెల్లించాలి.

ఇన్‌ఛార్జ్ మంత్రులుగా మనోహర్, గొట్టిపాటి

నిమ్మలకు రెండు జిల్లాల బాధ్యతలు




(భీమవరం/ఏలూరు-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వం జిల్లాలకు ఇన్‌ఛార్జ్‌ల మంత్రులను నియమించింది. ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను పశ్చిమ గోదావరి జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రిగా, ఏలూరు జిల్లాకు పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌లను నియమిస్తూ ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులను సమీక్షించి దిశానిర్దేశం చేసే బాధ్యతలను ఇన్‌ఛార్జ్ మంత్రులు నిర్వహించనున్నారు. ప్రతి ప్రభుత్వంలోనూ జిల్లా కు ఇన్‌ఛార్జ్‌ను నియమించడం ఆనవాయి తీగా వస్తోంది. సంక్షేమపథకాలు, అభి వృద్ధి పనులను పరిశీలించి పర్యవేక్షించడంలో ఇన్‌ఛార్జ్ మంత్రులు కీలకంగా వ్యవహరిస్తారు. జిల్లాకు ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరించనున్న గొట్టిపాటి రవికుమార్‌కు పల్నాడు జిల్లాకు కూడా ఇన్‌చార్జ్‌గా నియమించింది. సీని యర్లకు మాత్రమే రెండు జిల్లాలకు బాధ్య తలు అప్పగించారు. ఆ క్రమంలోనే జిల్లా నుంచి జల వనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తూర్పు గోదావరి పాటు, కర్నూలు జిల్లాకు కూడా ప్రాతినిధ్యం వహించనున్నారు. సమర్థవంతంగా పనిచేస్తారన్న నమ్మకంతో నిమ్మలకు రెండు జిల్లాలకు ఇన్‌ఛార్జ్ బాధ్యతలను అప్పగించింది. ఏలూరు జిల్లా రాజకీయా లతో సత్సం బంధాలు ఉండడం, వివాద రహితుడిగా పేరొందిన మనోహర్‌ను నియమించడం అటు టీడీపీ, ఇటు జన సేనలో హర్షం వ్యక్తమైంది.

ఏలూరు నగరంలో దొంగల జోరు

పోలీసు నిఘా వైఫల్యం

ఏలూరు క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రమైన ఏలూరు నగరంలోనే పోలీసులకు దొంగలు సవాళ్ళు విసిరినట్లు నేరాలకు పాల్పడుతున్నారు. కొద్ది రోజులుగా నగరంలో పరిశీలన జరిపితే నేరస్తులు రెచ్చిపోతున్నారు. తెల్లవారేటప్పటికి ఏదో ఒక ఇంట్లో కన్నం వేస్తున్నారు. నగరంలో శాంతిభద్రతలు కాపాడడానికి మూడు లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్లు, నేరస్తులను పసిగట్టడానికి ఒక సీసీఎస్ పోలీస్ స్టేషన్ ఉన్నాయి. అయినప్పటికీ ఇటీవల దొంగలు తమ చేతి వాటాన్ని ప్రదర్శిస్తూనే ఉన్నారు. ఏలూరు టూటౌన్, త్రి టౌన్, రూరల్ ప్రాంతాల్లో ఈ నేరాలకు ఎక్కువగా పాల్పడుతున్నారు. త్రి టౌన్ పరిధిలో మాత్రం ఒకే ఒక్కడు అన్నట్లుగా ఒక దొంగ మాస్క్ ధరించి నేరాలకు పాల్పడుతున్నట్లుగా పోలీసులు గుర్తించినట్లుగా తెలుస్తోంది. ఇప్పటికే పాత నేరస్తులు ఎక్కడ ఉన్నారు? ఏమి చేస్తున్నారు అనే కోణంలో కూడా దర్యాప్తు చేయాల్సి ఉంది. ఇటీవల పోలీసులకు బందోబస్తులు ఎక్కువ కావడంతో నగరంలో పోలీసింగ్ గస్తీ తగ్గిందనే తెలుస్తోంది. దీంతో ఇదే అదనుగా తీసుకున్న దొంగలు దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఇంటికి తాళం వేసి ఉందంటే క్షణాల్లో ఆ ఇంటిని దోచేస్తున్నారు. క్లూస్ టీమ్‌లు, పోలీసు జాగిలాలు రంగంలోకి దిగుతున్నప్పటికీ ఫలితాలు రావడం లేదని తెలుస్తుంది. కొత్త నేరస్తుల, పాత నేరస్తులా అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారని తెలుస్తోంది. సీసీ కెమెరాల్లో మాత్రం ఒక మాస్క్ ధరించిన నేరస్తుడే నేరాలకు పాల్పడుతున్నట్లుగాపోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. నగరంలో నిఘా పెంచాలని ప్రజలు కోరుతు న్నారు. జిల్లా కేంద్రంలోని వందలాది మంది పోలీసులు ఉండే ప్రాంతంలోనే నేరాలు జరుగుతు న్నాయంటే మిగిలిన ప్రాంతాల పరిస్థితి ఏమిటనే ప్రశ్న తలెత్తుతోంది.

120 ఏళ్లయినా చెక్కు చెదరలే..



చింతలపూడి తాలూకా కార్యాలయ ఆవరణలో ఉన్న ఈ భవనానికి 120 ఏళ్ళు. 1904లో బంగాళా పెంకుతో నిర్మించిన ఈ రాతికట్టడం ఇప్పటికీ చెక్కు చెదరకుండా పటిష్ఠంగా ఉంది. బ్రిటీష్ పరిపాలనలో ఇది నిర్మించబడింది. అప్పట్లో బ్రిటీష్ అధికారులు ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు విడిది భవనంగా ఉపయోగించేవారు. స్వాతంత్ర్యం అనంతరం 1964లో ఈ భవనంలో తాలూకా మున్సిబ్ మేజిస్ట్రేట్ కోర్టు ఏర్పాటు చేశారు. 2007 వరకు నిర్వహించారు. కోర్టు ఆవరణలో ఈ భవనం ఎంతో హుందాగా ఉండేది. ఆవరణలోకి ఎవరు రావాలన్నా వాహనం దిగివచ్చేవారు. అంత గౌరవంగా ఉండేది. కోర్టు మరో చోటుకి మారిపోయింది. అప్పటి నుంచి ఈ భవనాన్ని రెవెన్యూ అధికారులు ఉపయోగిస్తున్నారు. ఎన్నికల సమయంలో రిటర్నింగ్ అధికారి కార్యాలయంగాను, సాధారణ రోజుల్లో వీడియో కాన్ఫరెన్స్ హాలుగా వినియోగిస్తున్నారు. ఈ భవనం చూడటానికి క్యాంపస్ లోకి వచ్చే ప్రతివారు ఈ భవనం పటిష్ఠత గురించి చర్చించుకుంటారు.

-చింతలపూడి

తుఫాన్ హెచ్చరికలు..
పంట దక్కించుకునేందుకు రైతుల పాట్లు

చాట్రాయి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తుఫాను హెచ్చరికల నేపథ్యంలో రైతుల గుండెల్లో గుబులు పుడుతోంది. మండలంలో ముందుగా వేసిన 1010 రకం వరి పంట కోతలు జరుగుతుండగా, 1224 వరి రకం 10-15 రోజుల్లో కోత దశలో ఉంది. తుఫాను భయంతో కోతకు వచ్చిన వరి పంటను యంత్రాలతో హడావుడిగా కోస్తున్నారు. తుఫాను కారణంగా భారీ వర్షాలు కురిస్తే వరి పంట నేలవాలి తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో మండలంలో 112 సాగునీటి చెరువులు, తమ్మిలేరు రిజర్వాయర్ ప్రాజెక్టు కింద 12 వేల ఎకరాలు వరిసాగు జరిగింది. వాతావరణం అనుకూలంగా ఉండటంతో ఈ ఏడాది మంచి దిగుబడులు వస్తాయని రైతులు అంటున్నారు. అల్పపీడనంతో రెండు రోజుల నుంచి జల్లులు పడుతుండటంతో రైతుల కంటి మీద కునుకు లేదు. తుఫాను గండం నుంచి కాపాడాలని రైతులు దేవుళ్ళకు మొక్కుకుంటున్నారు.





లోపూడిలో మంత్రి పార్థసారథి.. ముదినేపల్లిలో కామినేని.. ఆలపాడులో టీడీపీ నాయకుడు పెన్మెత్స త్రినాథరాజు సీసీ రహదారుల నిర్మాణానికి శంకుస్థాపనలు చేసిన దృశ్యం

పల్లెల అభివృద్ధికే పండుగ : మంత్రి సారథి

ముసునూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం కోసం ప్రభుత్వం పల్లె పండుగ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. అక్కిరెడ్డిగూడెంలో రూ 15.50లక్షలతో నిర్మించనున్న 5 సీసీ రోడ్లు, సూరేపల్లిలో రూ. 16లక్షలతో నిర్మించే 3 సీసీ రోడ్లు, లోపూడిలో రూ. 21లక్షలతో చేపట్టే ఒక సీసీ రోడ్డు, చెక్కపల్లిలో రూ. 29.75లక్షలతో నిర్మించే 7 సీసీ రోడ్ల పనులకు మంగళవారం మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రజల ఇళ్ళ వద్దకు వెళ్ళిన ఆరుబయట అరుగుపై కూర్చొని సమస్యలను అడిగి తెలుసుకోవడం గమనార్హం. తాగునీటి సమస్య ఉన్న గ్రామాల్లో యుద్ధప్రాతిపదికన పరిష్కార చర్యలు చేపట్టాలని పంచాయతీరాజ్ అధికారులను మంత్రి ఆదేశించారు. డిసెంబరు నెలాకరులోపు సీసీ రోడ్లు నిర్మాణాలు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం చెక్కపల్లిలో జరిగిన ప్రజా వేదికలో పాల్గొన్న మంత్రి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. సర్పంచ్‌లు పులిబళ్ళ లక్ష్మీ సత్యనారాయణ, తల్లిబోయిన రాధిక సత్యనారాయణ, ఎంపీపీ కొండా దుర్గాభవాని, ఎంపీటీసీ పుష్పావతి శ్రీనివాసరావు, ఎంపీడీవో జి.రాణి, తహసీల్దార్ శర్మ, పంచాయతీరాజ్ డీఈ కమలకిషోర్, ఏఈ దుర్గాప్రసాద్, ఏపీవో రోజ్‌లీలా, జనసేన నాయకులు ఫణిబాబు. పాశం నాగబాబు, మండల, గ్రామస్థాయి టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల పెంపే ధ్యేయం: కామినేని

ముదినేపల్లి: గ్రామాల్లో ప్రజలకు మౌలిక సదుపాయాలు పెంచాలన్నదే కూటమి ధ్యేయమని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ముది నేపల్లి మండలం పెదపాలపర్రు, కోడూరు, ముదినేపల్లి, వడాలి, శ్రీహరిపురం గ్రామాల్లో సుమారు రూ.కోటి పది లక్షల నిధులతో చేపట్టనున్న అంతర్గత రహదారుల నిర్మాణానికి ఆయన శంకు స్థాపన చేసి మాట్లాడుతూ గ్రామ సభల్లో ప్రజల అభిప్రాయాల మేరకు రూపొందించిన ప్రణాళిక ప్రకారమే పనులు చేపట్టినట్లు తెలిపారు. కైకలూరు నియోజకవర్గంలో సుమారు రూ.20 కోట్ల నిధులతో పల్లె పండుగ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైసీపీ విస్మరించిన గ్రామీణాభివృద్ధికి కూటమి ప్రభుత్వం తిరిగి నాంది పలుకుతుందని అన్నారు. నియోజ కవర్గ టీడీపీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, మండల అధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ సంస్థ డైరెక్టర్ కొడాలి వినోద్, ఎంపీడీవో రామకృష్ణ, టీడీపీ నాయకులు చలసాని జగన్మోహన రావు, కోడూరు శేషుబాబు, బొర్రా చలమయ్య, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు, జనసేన మండల కన్వీనర్ వీరంకి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు నిమ్మగడ్డ కైకమ్మ, గంటా రాకేష్, పరసా విశ్వేశ్వరరావు, అడుసుమిల్లి కృష్ణకుమారి, మరీదు దుర్గా శ్రీ, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కూటమితో గ్రామాలకు వెలుగు

కైకలూరు: గత వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిన పంచా యతీలను కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేసి వెలుగు నింపుతోం దని టీడీపీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు అన్నారు. మంగళ వారం ఆలపాడులో పల్లెపండుగ సందర్భంగా 4 సీసీ రోడ్లకు సర్పంచ్ కొప్పుల కృష్ణకుమారి ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. మండలంలో ప్రతి గ్రామంలోనూ సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 4.54 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. మాజీ ఎంపీటీసీ నల్లగచ్చు బాబులు, కూటమి నాయకులు కాంట్రాక్టర్ కృష్ణంరాజు, కొప్పుల ఏడుకొండలు, పోసిన వెంకన్న, పటమట బాబురావు, పేటేటి భూషారావు, తాళ్ళబట్టు రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి: వెంకటాపురంలో రూ.27.4 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డుకు సర్పంచ్ శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి శంకుస్థాపన చేశారు. తాడినాడలో రూ.31 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డుకు సర్పంచ్ టి.శ్రీనివాసరావు, కొండూరులో రూ.7.5 లక్షలతో నిర్మించే రహదారికి సర్పంచ్ వెంకటలక్ష్మి కూటమి నాయకులతో కలసి శంకుస్థాపన చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, నాయకులు కొత్తపల్లి బంగార్రాజు, రంగరాజు, కురేళ్ల ఏడుకొండలు, కర్రేటి శ్రీహరి, శ్రీరామకృష్ణ, పంచాయతీ రాజ్ ఏఈఈ శ్రీనివాసరావు, ఉపాధి ఏపీవో ఆనంద్ పాల్గొన్నారు.



వరద బాధితుల కోసం రూ. 50 వేలు విరాళం

ముసునూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అక్కిరెడ్డిగూడెం షిర్డీ సాయిబాబా ఆలయ చైర్మన్ పోలవరపు నరసింహారావు విజయవాడ వరద బాధితుల సహాయార్థం రూ. 50 వేలు చెక్కును మంగళవారం మంత్రి పార్థసారథికి అందజేశారు. ఈ సందర్భంగా నరసింహారావును మంత్రి అభినందించారు. సర్పంచ్ పులిబళ్ళ లక్ష్మీ, టీడీపీ గ్రామ అధ్యక్షులు బర్మా శ్రీనివాసరావు, రాష్ట్ర బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ లబ్ధిదారులకు న్యాయం చేయండి

నూజివీడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ గృహకల్ప పథకంలో లబ్ధిదారులుగా నమోదై వివిధ దశల్లో నిర్మాణ పనులు జరిగి మధ్యలో ఆగిపోయి ఉన్న లబ్ధిదారులకు సత్వర న్యాయం చేయాలని మంత్రి పార్థసారధిని సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా నరేంద్ర విజ్ఞప్తి చేశారు. మంగళవారం నూజివీడు మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసి విజ్ఞప్తి చేశారు. వైసీపీ లబ్ధిదారులను పట్టించుకోక పోవడంతో వీరికి బ్యాంకుల నుంచి నోటీసులు అందటం విచారక రమన్నారు. పారిశ్రామికవేత్త మూల్పూరి లక్ష్మణ స్వామి తదితరులు పాల్గొన్నారు.




కైకలూరు, కోరుకొల్లులో కలాంకు నివాళులు

యువతకు స్ఫూర్తి కలాం

కైకలూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా మంగళవారం కైకలూరు పంచాయతీ కార్యాలయంలోని ఆయన విగ్రహానికి టీడీపీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. పలువురు నేతలు మా ట్లాడుతూ శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా ఆయన సేవలు అభినందనీయమని యువతకు ఆయన స్ఫూర్తి అన్నారు. తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పూల రామ చంద్రరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ జానీ, జిల్లా మైనార్టీ సెల్ కార్యదర్శి సయ్యద్ బాషీద్, మండల ఉపాధ్యక్షుడు ఎండీ ఉస్మాన్, వేములపల్లి కారుణ్య, పట్టణ పార్టీ ఉపాధ్యక్షుడు పడమటి వాసు, వార్డు సభ్యుడు గాలిబ్ తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి: కోరుకొల్లులో కలాం విగ్రహానికి కూటమి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలాం ఆశయాలను నేటి తరం యువత నెరవేర్చాలన్నారు. కూటమి నాయకులు కేశిరెడ్డి బలరామ్, రామ సత్యనారాయణ, మంతెన రామరాజు, వలవల రమేష్, నున్న సుబ్రహ్మణ్యం, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ కాళ్ల వితరణ

ఆగిరిపల్లి, అక్టోబరు 15: సమాజంలో వివిధ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వారికి దాతల సహకారం ఎంతో అవసరమని రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు అన్నారు. తోటపల్లిలో గల హీల్ కృత్రిమ అవయువ కేంద్రంలో సంఘ సేవకురాలు మొవ్వ శారద, ఆమె భర్త దివంగత డా. కొత్త రవీంద్రబాబు పేరిట ఇచ్చిన ఆర్థిక సహాయంతో ఏలూరు జిల్లా రమణక్కపేటకు చెందిన మౌనిక, సింగన్నగూడెంకు చెందిన సిహెచ్ మేఘన, ఎన్టీఆర్ జిల్లా తిరువూరుకు చెందిన డి.శిరీష, కొండూరుకు చెందిన ప్రియాంకలకు కృత్రిమ కాళ్ళను అందజేశారు.

పెండ్లి కుమార్తెకు బంగారు నాణెం అందజేత

చాట్రాయి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): చీపురుగూడెం పాల సహకార సంఘానికి పాలుపోస్తున్న బొట్టు ఝాన్సీ కుమార్తె లక్ష్మీప్రియ వివాహం సందర్భంగా కృష్ణామిల్క్ యూనియన్ కల్యాణమస్తు పథకం కింద రూ. 20 వేలు విలువైన బంగారు నాణేన్ని మంగళవారం సంస్థ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు పెండ్లి కుమార్తెకు అందజేశారు. స్థానిక నాయకులు మందలపు జగదీష్, పాపోతు రాంబాబు, పాడి రైతులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ ఎంఓయూ

నూజివీడు, అక్టోబరు 15: నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి పెరబుల్‌అనే సంస్థతో నూజివీడు ట్రిపుల్ ఐటీ మంగళవారం ఎంఓయు కుదుర్చుకుంది. ఈ కార్యక్రమంలో భాగంగా డాటా సెంటర్ వ్యవస్థాపకులు ప్రణవమూర్తి, జోసఫ్, సురేంద్రలు నూజివీడు ట్రిపుల్ ఐటీని సందర్శించారు. విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధిని, కోడింగ్ స్కిల్స్‌ను పరిశీలించారు. అనంతరం నూజివీడు ట్రిపుల్ ఐటీలోని 15 మంది విద్యార్థులను లాంగ్ టెర్మ్ ఇంటర్న్‌షిప్‌కు ఎంపిక చేశారు. ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ అమరేంద్రకుమార్, ఏవో లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

విత్తన రైతులకు అగ్రిమెంట్లు ఇప్పించాలి

నూజివీడు టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న విత్తన రైతులకు విత్తన కంపెనీల నుంచి అగ్రిమెంట్లు ఇప్పించాలని రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. నూజివీడులో నిర్వహించిన రాష్ట్ర రైతు సంఘ సదస్సులో ఆయన మాట్లాడుతూ మొక్కజొన్న సీడ్ సీజన్ ప్రారంభమైందని కంపెనీల నుంచి ఆర్గనైజర్ల ద్వారా విత్తనాలు రైతులకు ఇవ్వడం జరుగుతుందన్నారు. అయితే రైతులకు ఎలాంటి అగ్రిమెంట్స్ ఇవ్వకపోవడంతో మోసాలకు గురై రైతులు నష్టపోతున్నారని వీటిని అరికట్టేందుకు కంపెనీల నుంచి అగ్రిమెంట్లను ఇవ్వాలన్నారు. నూజివీడు మామిడికి మార్కెట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సీఐటీయు జిల్లా అధ్యక్షుడు జి.రాజు, రైతు సంఘం నాయకులు పి.బోసు, లెనిన్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఐసీ ఏజెంట్ల ఆందోళన

నూజివీడు టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇన్సూరెన్స్ పాలసీలపై జీఎస్టీని తొలగించాలని ఎల్‌ఐఏఎఫ్‌ఐ సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు టి. లాజరస్ డిమాండ్ చేశారు. ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద ఏజెంట్లు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలసీదార్లకు పాలసీలపై బోనస్ రేట్లు పెంచాలని పాలసీల్లో బ్యాక్ క్లాస్ తొలగించాలని, ఏజెంట్లకు ఇచ్చే కమీషన్ పెంచాలని డిమాండ్ చేశారు. సెక్రటరీ మల్లిశెట్టి శ్రీనివాస్, ట్రెజరర్ తగరం ప్రభాకర్రావు తదితరులు పాల్గొన్నారు.

కొనకళ్ళను కలసిన తల్లాడ

చాట్రాయి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన బందరు మాజీ ఎంపీ కొనకళ్ళ నారాయణను మంగళవారం విజయవాడలో జిల్లా తెలుగు యువత కార్యదర్శి తల్లాడ శ్రీనివాసరావు కలిసి అభినందించారు. ఆర్టీసీ ప్రగతి పథంలో పయనించాలని తల్లాడ ఆకాంక్షించారు.

నేడు సర్వసభ్య సమావేశం

ముసునూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ముసునూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు జరుగుతుందని ఎంపీడీవో జి.రాణి తెలిపారు. ఎంపీపీ కొండా దుర్గాభవాని అధ్యక్షతన జరిగే సమావేశానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆమె కోరారు.

మొక్కు తీరింది..

ముదినేపల్లి, అక్టోబరు 15 : ఎన్నికల్లో కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కూటమి అభ్యర్థిగా డాక్టర్ కామినేని శ్రీనివాస్ విజయం సాధిస్తే ఆయనతో సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీ వల్లీదేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో 108 కొబ్బరికాయలు కొట్టిస్తానన్న మొక్కును శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు తీర్చారు. మంగళవారం కామినేని పల్లె పండుగలో మండలంలోని పలు గ్రామాల్లో పాల్గొన్న అనంతరం ఆలయంలో పూజలు చేసి సర్పంచ్ మొక్కుకున్న విధంగా కొబ్బరి కాయలు కొట్టారు. ఆలయ అసిస్టెంట్ కమీషనర్ శ్రీదేవి కామినేనిని సత్కరించారు.

యువకుడిపై దాడి

కలిదిండి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కైకలూరు మండలం అటపాకకు చెందిన మారగాని పూర్ణ విజయ రాజు అనే యువకుడు కారులో కలిదిండి మండలం గోపాలపురంలో చెరువు వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా, వెంకటాపురంలో దుర్గమ్మ ఊరేగింపు జరుగుతోంది. ట్రాఫిక్ ఉండడంతో విజయబాబు కారు హారన్ కొట్టగా వెంకటాపురం గ్రామానికి చెందిన ఉదయ్‌తోపాటు ఇద్దరు వ్యక్తులు విజయబాబుపై దాడి చేశారు. క్షతగాత్రుడిని కైకలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ కిషోర్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చారిత్రక వైభవం



వివాహమైనా, జాతరైనా ఏ మంచి పనైనా ఊరికి దూరంగా ఉన్న మల్లయ్యపోడు నుంచి ప్రారంభించడం అక్కడి ఆచారం. కానీ అక్కడ ఒక పెద్ద శివాలయం ఉందనే సంగతి పూర్వీకుల మాటల్లో తప్ప వారెప్పుడూ చూసి ఎరుగరు. 15 సంవత్సరాల కిత్రం జరిగిన ఒక సంఘటన కొన్ని వాస్తవాలను గ్రామస్థులకు పరిచయం చేసింది.. -నూజివీడు టౌన్



చరిత్రకు దొరకని ఆలయం

నూజివీడు మండలం రావిచర్ల గ్రామంలోని మల్లయ్యపోడులో పదిహేనేళ్ల క్రితం వ్యవసాయ భూమిలో పంటల సాగుకు వేసిన పైప్‌లైన్ నీరు ఒక రాయిపై ధారాళంగా పారింది. శివునికి జలాభి షేకం జరిగిన విధంగా క్రమక్రమంగా భూమిలో పాతుకుపోయిన పెద్ద పాలరాయి శివలింగం బయటపడింది. శివలింగం చుట్టూ గర్భాలయం నిర్మాణం ఉన్న విధంగా ఇటుకరాళ్ళ నిర్మాణం కనిపించింది. పూర్వీకులు చెప్పినట్టుగా అత్యంత పురాతన ఆలయం అక్కడ ఉందనే వాదనలకు బలం చేకూరింది. అయితే ఆ ఆలయం ఏ కాలం నాటిది ?? ఎవరు నిర్మించారనేది తేలాలంటే పురావస్తుశాఖ పరిశీలించి చెప్పాలి..

నమ్మకాలు సజీవం

మల్లయ్యపోడులో శిథిల నందీశ్వరునికి, అంజనేయస్వామికి తరతరాలుగా గ్రామస్థులు పూజలు చేస్తున్నారు. తరాలు మారుతున్నా వారి ఆచార వ్యవహారాలను ఆచరిస్తూనే ఉన్నారు. మల్లయ్యపోడులో శిథిలమైన నంది విగ్రహంతో పాటు హను మంతుని విగ్రహం శతాబ్దాలుగా పూజలు అందుకుంటున్నాయి. రావిచర్ల వాసులు ఏ శుభకార్యం తలపెట్టినా అక్కడ పూజలు నిర్వహించి ప్రారంభించేవారు.



బిడ్డ అడ్డం తిరిగిందని చెప్పే నందీశ్వరుడు

రావిచర్ల గ్రామంలో పురుడు పోసుకునే మహిళకు పురుడు కష్టమైతే ఆ ఇంటి పెద్ద మల్లయ్య పోడులోని నందీశ్వరుని వద్దకు వచ్చి ప్రత్యేక పూజలు చేసేవారు. ఈ క్రమంలో నందీశ్వరుని తల పక్కకు తిరిగి ఉంటే దానిని సరి చేసి ఇంటికి తిరిగివెళ్లే సమయానికి మహిళకు సుఖప్రసవం జరిగేదని గ్రామస్థులు చెబుతారు. గంగానమ్మ జాతరతో పాటు ఇతర శుభకార్యాలు ఇక్కడి నుంచే ప్రారంభిస్తారు.

నిట్టనిలువునా చీలి వున్న శివలింగం

వ్యవసాయ భూమిగా ఉన్న పొలంలో నీరు పెట్టగా ఆ నీటి ధారకు శివలింగం బయటపడింది. అది ఒక రాయిగా భావించిన స్థానికులు దాన్ని బయటకు తీద్దామని చుట్టూ దాదాపు ఆరు నుంచి ఏడు అడుగులు తవ్వగా భారీ శివలింగం కనిపించింది. అయితే నిట్ట నిలువుగా పగులకొట్టబడి ఉండటంతో ఎలాగైనా శివ లింగాన్ని బయటకు తీయాలని రైతులు ప్రయత్నించారు. అయినా సాధ్యం కాకపోవడంతో తిరిగి గోతిని పూడ్చి వేశారు. నాటి నుంచి ఆ శివలింగానికే పూజలు చేస్తూ వస్తున్నారు.

నిజాం పాలనలో ఆలయం ధ్వంసం

రావిచర్ల మల్లయ్యపోడులో శివాలయం అత్యంత పురాతన మైనదని గర్భాలయం ఇటుకలతో నిర్మాణం చేసి ఉందని, ఒక్కో ఇటుక అర్ధగజం పొడవు, వెడల్పుతో ఉన్నాయని గ్రామస్థులు తెలుపుతున్నారు. అయితే గతంలో రావిచర్ల పక్కనే ఉన్న బోర్వంచ గ్రామం నిజాం పాలనలో ఉందని నిజాం దండయాత్రలతోనే ఈ ఆలయం ధ్వంసమైందని చెబుతున్నారు.

పురావస్తు శాఖ పరిశోధన చేస్తే తెలుస్తుంది

అధికారుల పరిశోధన చేయడం ద్వారా నూజివీడు ప్రాంతంలో శాత వాహనులు లేదా ఆ తరువాత రాజ్యమేలిన రాజుల పాలనలో ఇక్కడ ఆలయం నిర్మించినదా అనేది తెలుస్తుంది. పురావస్తు శాఖ ఆధ్వర్యంలో పరిశోధనలు చే స్తే ఆలయ విశేషాలను వెల్లడి అవుతాయని గ్రామస్తులు కొణతం సాంబశివరావు, మరీదు గోవింద రాజులు, కుటుంబరావు చౌదరి, మరీదు సత్యనారాయణ, చెన్నకేశవరావు, సీతారామయ్య, శ్రీనివాసరావు తదితరులు కోరుతున్నారు.



ఆంజనేయస్వామి విగ్రహం